ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

మంగళవారం 12 మార్చి 2024



ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 38.0

కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:20 (మంగళ)

సహారి : 4:51 (బుధ)

తపనా.. సుజనా?

బీజేపీ : ఏలూరు ఎంపీ బరిలో నిలిచేదెవరు ?

- ఉమ్మడి అభ్యర్థిగా ఎవరనేదే అందరి ప్రశ్న
- రాష్ట్రస్థాయి పరిణామాలపైనా నేతల ఆరా
- రెండ్రోజుల్లో తేలబోతుందన్న సీనియర్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)





ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో పట్టుజారకుండా కమలం కసరత్తు సుదీర్ఘంగా సాగుతోంది. పొత్తులో భాగంగా తమకు కేటాయించిన స్థానాల సంఖ్య విషయంలో రాజీపడకుండా తొలి అడుగువేసిన బీజేపీ, తాము ఆశించిన స్థానాల విషయంలో ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు. ఉమ్మడి పశ్చిమలో ఏలూరు, నరసాపురం లోక్‌సభా స్థానాల్లో తమకు కేటాయించే స్థానంపై సోమవారం సుదీర్ఘ కసరత్తు నెరపింది. బీజేపీ జాతీయ నేతలు అటు పవన్‌తో ఇటు టీడీపీ అధినేత చంద్రబాబుతో సుదీర్ఘ మంతనాలు కొనసాగిస్తున్నారు. ఒకవేళ మార్పులు చేర్పుల్లో భాగంగా ఒక పార్లమెంట్ స్థానం బదులుగా మరో స్థానం కేటాయిస్తే ఆ మేర కోల్పోయిన స్థానంలో అసెంబ్లీ సీటును కోరుకుంటున్నట్టు సమాచారం. ఇప్పటికే కమలం పార్టీలో కేడర్ అంతా ఉత్కంఠతో ఉంది. తమ పార్టీ గతంకంటే బలోపేతమైందని, దీనికి తగ్గట్టుగానే పోటీ ఉండాలని భావిస్తోంది.

ఎవరి వైపు మొగ్గు

ఏలూరు లోక్‌సభ స్థానం ఆశిస్తున్న బీజేపీ చివరిక్షణం వరకు పట్టు విడవకుండా వ్యూహాత్మకంగానే ముందడుగు వేస్తోంది. ఈ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, (తపన చౌదరి) పోటీకి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. సేవా కార్యక్రమాలను విస్తరించి తపన ఫౌండేషన్ ద్వారా ప్రజలకు చేరువకావడం ద్వారా వచ్చే ఎన్నికల్లో బీజేపీ పక్షాన ఎంపీగా పోటీ చేయాలని ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఏలూరు నగరంతో సహా ముఖ్య పట్టణాలన్నింటిలోనూ ఆయనకు వ్యక్తిగతంగా ఇమేజ్ పెరిగింది. మరోవైపు తపన చౌదరితోపాటు కొన్నాళ్లుగా మాజీ ఎంపీ సుజనాచౌదరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ ప్రచారంతో తపన అభ్యర్థిత్వాన్ని కోరుతున్న వారంతా గందరగోళంలో పడ్డారు. ఆరెస్సెస్ పరివార్ తపనవైపే మొగ్గు చూపుతుండగా, సుజన తెరముందుకు వచ్చారు. సుజనాను నేరుగా వ్యతిరేకించకుండా, తపన చౌదరి పక్షాన మొగ్గు చూపడం ఇంకో పరిణామం. జనసేన వర్గాలు చాన్నాళ్లుగా తపనతో సన్నిహిత సంబంధాలు కలిగి వున్నారు. ఒకవేళ నరసాపురం లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తే ఏలూరు లోక్‌సభ స్థానాన్ని బీజేపీ వదులు కోవాల్సి వస్తుందేమోనన్న టెన్షన్ లోనే పార్టీ శ్రేణులన్నీ వున్నాయి. 'సాధ్యమైనంత మేర ఏలూరు నుంచి పోటీకి వీలుగా తపన చౌదరికే పార్టీ అవకాశం ఇస్తుందని భావిస్తున్నాం' అత్యధికుల భావన ఇది. తపన చౌదరి వచ్చే ఎన్నికల్లో పోటీకి వీలుగా ప్రచార సామగ్రిని సోమవారం సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. బయట ఎంత ప్రచారం సాగుతున్నా, తర్జన భర్జనలు కొనసాగుతున్నా, వీటిని పట్టించుకోకుండా ఏలూరు లోక్‌సభ నుంచే తన పోటీ ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ తన అనుచర వర్గం, పార్టీ కార్యకర్తలకు ఎన్నికల పనులను పురమాయిస్తున్నారు. ఏలూరు సీటు ఎవరికి దక్కుతుందనేది ఒకటి, రెండు రోజుల్లో తేలిపోనుంది.

నేడు జనసేనలోకి అంజిబాబు

భీమవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పార్టీలో చేరనున్నారు. భీమవరం నుంచి జనసేన నాయకులతో కలిసి మంగళవారం ర్యాలీగా మంగళగిరి వెళతారు. అక్కడ మధ్యాహ్నం 12 గంటలకు పార్టీలో చేరతారు. ఇటీవల పవన్ భీమవరం వచ్చినప్పుడు అంజిబాబును మర్యాద పూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విజయవాడలో భేటీ అయ్యి భీమవరం రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. ఈ నియోజకవర్గం నుంచే అంజిబాబు జనసేన తరపున బరిలోకి దిగనున్నారు.

బొబ్బికి బాబు పిలుపు.. నేడు భేటీ

భీమవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జికి పార్టీ అధినేత చంద్రబాబు నుంచి పిలుపు వచ్చింది. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ భేటీ జరగనుంది. దీనికి స్థానిక ముఖ్య నాయకులు కూడా హాజరు కానున్నారు. పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం జనసేనకు కేటాయించడంతో ఒకటి, రెండు రోజులలో బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటన చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు బాబ్జికి భరోసా కల్పించడంతోపాటు, నియోజకవర్గంలో పార్టీకి ఎలాంటి నష్టం వాటిల్లకుండా కార్యాచరణ రూపొందించనున్నారు.

త్రిశూలంతో జగన్ పాలన అంతం

టీడీపీ పశ్చిమ జిల్లా అధ్యక్షురాలు తోట

భీమవరం అర్బన్, మార్చి 11 : ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ పాదయాత్ర చేసి నవరత్నాల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'టీడీపీ-బీజేపీ-జనసేన త్రిశూలంతో రాష్ట్రంలో సీఎం జగన్ దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి ముందుకు వస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ, కాపు సంక్షేమం తదితర అభివృద్ధి పథకాలను రద్దు చేసిన జగన్ వలంటీర్ల ద్వారా తిరిగి అధికారంలోకి రావాలనుకోవడం అసంభవం. తన సిద్ధం సభలలో జనం లేకపోయినా గ్రాఫిక్స్ మాయాజాలంతో ప్రజల దృష్టిని మార్చలేరు' అని అన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు ప్రచార రథాలు



భీమవరం టౌన్, మార్చి 11 : జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటిని బీజేపీ మేనిఫెస్టోలో చేర్చేందుకు ఏర్పాటుచేసిన ప్రచార రథాలను సోమవారం భీమవరంలోని నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాకా సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ- బీజేపీ-జనసేన పొత్తుల్లో భాగంగా బీజేపీ గెలిచే అవకాశం ఉన్న విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, రాజమండ్రి, నర సాపురం, తిరుపతి, రాజంపేట వంటి పార్లమెంటు స్థానా లను అధిష్టానానికి వివరించామ న్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చి బీజేపీ టికెట్ ఆశించే వారిపట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పేరిచర్ల సుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు అల్లూరి సాయిదుర్గరాజు, కోమటి రవికుమార్, పట్టణ కన్వీనర్ కాగిత సురేంద్ర, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ మోహీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలో కాంగిరేసు

ఏలూరు జిల్లాలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకూ పోటీ

- అభ్యర్థుల దరఖాస్తులు వడబోసిన పీసీసీ
- ఈ వారంలో జాబితా విడుదలకు అవకాశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వచ్చే సాధారణ ఎన్నికల్లో తమ అభ్యర్థులను రంగంలో దించేందుకు కాంగ్రెస్ తుది ప్రయత్నాల్లో పడింది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తుల వడపోత దాదాపు పూర్తి కావొచ్చింది. ఆయా నియోజక వర్గాల్లో వున్న రాజకీయ, ఆర్థిక సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులను ఎంపిక చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. వామపక్షాలతో ఎన్నికల దోస్తీకి కట్టుబడుతూనే పార్లమెంట్ స్థానాలకు ఆర్థిక హంగు కలిగిన వారిని రంగంలో దింపాలని భావిస్తోంది.

ఏలూరు లోక్‌సభకు పోటా పోటీ

ఏలూరు లోక్‌సభా స్థానం నుంచి పోటీ చేసేందుకు అత్యధికులు పోటీపడుతున్నారు. ఒకప్పుడు ఎన్నికలొచ్చాయంటే ఢిల్లీకి రెక్కలు కట్టుకుని వాలి తాము పోటీ చేసే స్థానాల నుంచి టికెట్ దక్కేలా నేతలంతా పోటీ పడేవారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ దాదాపు ఒట్టిపోయింది. 2014, 2019 ఎన్నికల్లోనూ అనేక స్థానాలకు కాంగ్రెస్ పోటీ చేసినా అది నామ్‌కే వాస్తేగా మిగిలింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల రంగంలోకి దిగిన తర్వాత కాంగ్రెస్‌లో కొంత జోష్ పెరిగి సమాంతరంగా ఆశావహుల సంఖ్య గతం కంటే రెట్టింపైంది. ఏలూరు లోక్‌సభా స్థానం నుంచి పోటీ చేసేందుకు 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఈ మధ్యనే ఏలూరుకు షర్మిల పర్యటనకు వచ్చినప్పుడు ఆమె సమక్షంలో చేరిన కావూరి లావణ్య ఏలూరు నుంచి బరిలో దిగేందుకు ఆసక్తితో ఉన్నారు. తనకు పార్టీపరంగా మద్దతు ఇవ్వాల్సిందిగా తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం కలిసి అభ్యర్థించారు. లావణ్యతోపాటు పద్మరాజు, కొండపల్లి శ్రీనివాస్, లీలా ప్రశాంతకుమారి, వెంకటరమణ, సత్యేంద్రబాబు సైతం ఎంపీ స్థానానికి పోటీకి సిద్ధంగా ఉన్నామని ఏపీసీసీకి దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. ఈ మధ్యనే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సైతం ఆశావహుల జాబితాను పూర్తిగా పరిశీలించి కొందరితో ముఖాముఖి భేటీ అవుతున్నారు. పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థులను త్వరలో ప్రకటించబోతున్నారు.



తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో భేటీ అయిన కావూరి లావణ్య

ఎమ్మెల్యే స్థానాలకు సైతం..

ఏలూరులోని ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. ఇక్కడ పోటీకి 50 మందికిపైగా పీసీసీకి దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో కొన్నిటిని పూర్తిగా తొలగించి, మరికొన్నింటిపై తుది కసరత్తు చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి సత్యేంద్రబాబు, విజయ్ అచ్యుతం, సుబ్బరాజు వంటివారు దరఖాస్తు చేసుకోగా, పాతపాటి హరికుమార్‌వైపు పార్టీ మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. దెందులూరు నుంచి ఆలపాటి నరసింహమూర్తి, డీవీఆర్‌కే చౌదరిలలో ఒకరికి చాన్స్ దక్కే అవకాశం ఉంది. ఏలూరులో పార్టీ అధ్యక్షుడు రాజనాల రామమోహనరావుతోపాటు మరో ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. బురదగుంట క్రాంతి, నేరెళ్ళ సతీష్ పేర్లు ప్రముఖంగా పరిశీలనలో ఉన్నాయి. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం పోలవరంలో అనేకమంది దరఖాస్తు చేసినా పైడా పోతురాజు, కొంగక పోసిరత్నం, శ్రీరామ్‌లలో ఒకరికి చాన్స్ ఇవ్వబోతున్నారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం చింతలపూడిలోనూ భారీ సంఖ్యలో ఆశావహులు కాంగ్రెస్ పక్షాన పోటీకి సిద్ధపడుతున్నారు. చింతలపూడిలో వున్న రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని సీనియర్లు, జూనియర్లు తెర ముందుకు వచ్చారు. ఈ స్థానం నుంచి పది మంది దరఖాస్తు చేసుకోగా, సుందరరావు, సురేష్, కొండపల్లి శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్ పేర్లపైనే కసరత్తు సాగుతోంది. నూజివీడు నుంచి ఏకైక ఆశావహుడు మచ్చా అశోక్‌ను రంగంలో దింపే అవకాశం ఉంది. కైకలూరులో ఎంవీఎస్‌ఆర్ గాంధీ, నాగరాజ్ గౌడ్, నిరీశ్వరరావు పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. తుది కసరత్తులో కొన్ని నియోజకవర్గాల్లో కొందరి పేర్లలో మార్పులు చేర్పులు చేసే అవకాశాలు స్పష్టంగా వున్నాయి. కాంగ్రెస్ నుంచి పోటీ చేసే ఆశావహులు ఇప్పటికే తమకు తోచిన మార్గాల్లో తమకు అనుకూలంగా తుది ప్రయత్నాలు చేస్తూ సీనియర్లతో భేటీ అవుతున్నారు.

చీకట్లో ఊళ్లు!

బిల్లులు చెల్లించలేదని పంచాయతీలకు విద్యుత్ కట్

- వీధి దీపాలు వెలగక అంధకారంలో పోలవరం మండల గ్రామాలు



వీధిలైట్లు వెలగక అంధకారంలో పోలవరం మెయిన్‌రోడ్

పోలవరం, మార్చి 11 : పోలవరం మండల గ్రామాలు చీకట్లలో చిక్కుకున్నాయి. అన్ని గ్రామ పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించక బకాయి పడడంతో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు వాటి విద్యుత్ కనెక్షన్లకు సరఫరా నిలిపివేశారు. వీధి లైట్లు వెలగకపోవడంతో అన్ని పంచాయతీల్లో గాఢాంధకారం అలుముకుంది. పోలవరం, గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, ఇటుకల కోట, వింజరం, చేగొండపల్లి, ప్రగడపల్లి, ఎల్ఎన్‌డీపేట, తూటిగుంట, కొరుటూరు, గెడ్డపల్లి పంచాయతీల్లో ఈ పరిస్థితి నెలకొంది. పంచాయతీలకు రావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ ఖాతాలకు మళ్లించుకుని వీటిని నిర్వీర్యం చేసింది. ఇప్పుడు వీటికి విద్యుత్‌ను నిలిపివేసింది. దీనిపై పట్టిసీమ, ప్రగడపల్లి, పోలవరం పంచాయతీ సర్పంచ్‌లు మాట్లాడుతూ నిధుల లేమి కారణంగా బిల్లులు సకాలంలో చెల్లించలేకపోయినట్టు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ కొండా సత్యనారాయణని వివరణ కోరగా మూడేళ్లుగా అన్ని పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, వారం రోజులుగా బకాయిల చెల్లింపు విషయంపై నోటీసులు పంపించామన్నారు. కోండ్రుకోట, జిల్లేళ్లగూడెం పంచాయతీలు మినహా మిగిలిన పంచాయతీలు బకాయిలు చెల్లించలేదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు.

వైభవంగా కొల్లేరు పెద్దింటమ్మ ఉత్సవాలు ప్రారంభం



కైకలూరు, మార్చి 11 : కొల్లేటి కోటలో కొలువై ఉన్న పెద్దింటి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 8.45 గంటలకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణలతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు విశేష పూజలను చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎంపీపీ అడవి కృష్ణ, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, ఆలయ అధికారి కేవీ గోపాలరావు, సయ్యపురాజు గుర్రాజు, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలు ఈనెల 24వ తేదీ వరకు జరగనున్నాయి. 21వ తేదీన జలదుర్గ అమ్మవారికి, గోకర్ణపురంలో కొలువై ఉన్న గోకర్ణేశ్వరస్వామి వార్లకు వైభవంగా కల్యాణం జరగనుంది.

ఎన్నికల సభల్లా చెక్‌ల పంపిణీ

- ఆసరా సభలో వైసీపీకి ఓట్లు వేయాలని నియోజకవర్గ సమన్వయకర్త విజయరాజు పిలుపు
- చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా చెక్‌లు పంపిణీ చేసి వెళ్లగానే.. వైసీపీ నేతలు మళ్లీ పంపిణీ

లింగపాలెం, మార్చి 11 : ఆసరా సభలను వైసీపీ నేతలు ఎన్నికల సభలుగా మార్చేస్తున్నారు. అదే పార్టీకి చెందిన చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా స్థానంలో నియోజకవర్గ సమన్వయకర్తగా విజయరాజును నియమించారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే చేయాల్సిన ప్రారంభోత్సవాలు, సభలు వరుసగా ఈ నేతలే నిర్వహిస్తున్నారు. లింగపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీఎం కమల ఆధ్వర్యంలో ఆసరా చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా మహిళలకు చెక్కును అందజేసి వెళుతుండగానే సమన్వయకర్త విజయరాజు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తూ సభను పార్టీ కార్యక్రమంలా మార్చేశారు. ఆయన మాట్లాడుతుండగానే మహిళలు వెనుతిరగడంతో వెలుగు సిబ్బంది గేట్లు మూసేశారు. విజయరాజు మరోసారి అదే చెక్కును మహిళలకు అందజేయడంతో ముక్కున వేలేసుకున్నారు.



గేటు మూసివేస్తున్న వెలుగు సిబ్బంది

ప్రోటోకాల్ పాటించాల్సిందే : ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : 'ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా జరగాలి. అధికారులైనా, పార్టీ నాయకులైనా ప్రోటోకాల్ పాటించాలి' అంటూ ఎమ్మెల్యే ఎలీజా వ్యాఖ్యానించారు. చింతలపూడిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'చింతలపూడి మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత పంపిణీలో పాల్గొనడానికి వెళ్లాను. ప్రోటోకాల్‌కు విరుద్ధంగా అనధికార వ్యక్తులు వేదికపై ఉండడంతో వెనుదిరిగి వచ్చేశాను. గతంలోనూ ఈ విధంగానే జరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా.' అని పేర్కొన్నారు.



వలంటీర్లతో కలసి కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు

వలంటీర్లతో ఎన్నికల ప్రచారం

ఉంగుటూరు, మార్చి 11 : ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఆదివారం సాయంత్రం, సోమవారం వలంటీర్లతో కలిసి వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల వైసీపీ కన్వీనర్ మరడ మంగారావు, ఎంపీటీసీ బండారు నాగరాజు, గృహ సారథులు వలంటీర్లను వెంటపెట్టుకుని గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాస్ (వాసుబాబు)కు ఓటేసి మరోసారి గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం మీకు ఎంతో మేలు చేసిందంటూ వివరించే ప్రయత్నం చేశారు. ఈ ప్రచారంపై గ్రామస్థుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై ఎంపీడీవో శర్మ వివరణ ఇస్తూ ఎన్నికల కోడ్ కంటే ముందు ఆయా గ్రామాల లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున ఏఏ ప్రయోజనాలు సమకూరాయో వివరాలతో ఉన్న కరపత్రాలను మాత్రమే పంపిణీ చేశారన్నారు. అయితే వలంటీర్లు ఎవరికి వారు తమ పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇవ్వొచ్చని, అందుకు విరుద్ధంగా వారి వెంట వైసీపీ నాయకులు ఎందుకు ఉన్నారంటూ ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు.

రాత్రిపూట ఎమ్మెల్యే సమీక్షలేమిటి ?!

- వేదిక వద్ద టీచర్ల హాజరు సేకరిస్తామంటూ బెదిరిస్తారా ? : ఏపీటీఎఫ్ అభ్యంతరం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 11 : సమీక్ష పేరుతో రాత్రిపూట ఏలూరు నగర శివార్లలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో దెందులూరు ఎమ్మెల్యే కె.అబ్బయ్యచౌదరి సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరు కావాలంటూ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బోధన, బోధనేతర సిబ్బందిని, ప్రధానోపాధ్యాయులను ఆదేశించడం పట్ల ఏపీటీఎఫ్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రాజకీయ నాయకులు పెట్టే సమావేశాలకు ఉపాధ్యాయులను బలవంతంగా హాజరుకావాలని, ప్రతీ పాఠశాలకు సంబంధించి హాజరును తీసుకుంటామని టీచర్లను బెదిరిస్తూ ఏలూరు ఎంఈవో-1, ఎంఈవో-2 మెసేజ్‌లు పెట్టి ఇబ్బంది పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. టీచర్లతో పాటు నియోజకవర్గంలోని అధికారులు, ఉద్యోగులు, కార్మికులను సమీక్షకు ఆహ్వానించారని వివరించారు. సమావేశాలను అవసరమైతే స్కూలు పనివేళల్లో నిర్వహించుకోవాలని సూచించారు.

స్పందనలో 179 అర్జీలు



ఏలూరు కలెక్టరేట్, మార్చి 11 : జగనన్నకు చెబుదాం స్పందనలో అందిన అర్జీలను ప్రజలకు సంతృప్తి కలిగే రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో జేసీ లావణ్యవేణి, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, ఆర్డీవో ఖాజావలీ తదితర అధికారులతో కలసి ఆయన మొత్తం 179 అర్జీలు స్వీకరించారు. తప్పుడు ధ్రువపత్రాలతో విద్యుత్‌శాఖలో కొందరు ఉద్యోగాలు నిర్వహిస్తున్నారని, కొన్నేళ్లుగా సీఎండీ, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విచారణ చేసి కుంభకోణాన్ని వెలికితీయాలని కోరుతూ బాధితుడు గోకవరపు శ్రీను తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 2016లో ఈ తంతు జరిగిందని జిల్లాలో 28 మంది నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు చేస్తున్నారని ఆరోపించారు.

ఏలూరు క్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలోఏఎస్పీ జి.స్వరూపరాణి స్పందన కార్యక్రమాన్ని ఏఎస్పీ నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి 60 మంది ఫిర్యాదులు చేశారు.

ఇంటర్ పరీక్షల్లో డిబార్ కేసు నమోదు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 11 : ఈ ఏడాది ఇంటర్ పరీక్షల్లో తొలి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైంది. సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం/జంతుశాస్త్రం/చరిత్ర పరీక్షలకు జనరల్ విభాగంలో 10,946 మంది, ఒకేషనల్ విభాగంలో 1738 మంది విద్యార్థులు హాజరవ్వగా 460 మంది గైర్హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు తెలిపారు. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో జువాలజీ పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిపై ఒక మాల్‌ప్రాక్టీస్ కేసును నమోదైంది.

'పది' ప్రశ్నాపత్రాలొచ్చేశాయ్!

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రశ్నాపత్రాల బండిళ్లు, కాన్ఫిడెన్షియల్ మెటీ రియల్ సోమవారం జిల్లాకు చేరుకున్నాయి. వీటిని సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. వాహనాల్లో సాయుధ పోలీసు బందోబస్తు నడుమ జిల్లావ్యాప్తంగా పరీక్షలు జరిగే 139 సెంటర్లకు చేరువగా వుండే 31 పోలీస్‌స్టేషన్లకు మంగళవారం చేర్చి భద్రత కల్పిస్తారు.

ఎన్నికల్లో ఖర్చు పరిమితికి మించకూడదు

ఏలూరు సిటీ, మార్చి 11 : ఎన్నికల్లో ఖర్చు పరిమితికి మించకూడదని, ఖర్చుపై రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మార్గదర్శకాలు, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రవర్తనా నియమావళి పాటించేలా వ్యయ పరిశీలకులు పర్యవేక్షణా బాధ్యతలు నిర్వర్తించాలని డీఆర్వో పుష్పమణి స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఎలక్షన్ ఎక్స్పెండీచర్ మానిటరింగ్ టీం, ఏఆర్వోలు, అక్కౌంటింగ్ టీమ్‌లకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికల ఖర్చుల విధి విధానాలను వివరించారు. ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశ్చిమ కొత్త జేసీగా ప్రవీణ్ ఆదిత్య

జేసీ రామసుందర్‌రెడ్డి కాకినాడ బదిలీ

భీమవరం, మార్చి 11 : పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డిని కాకినాడ జేసీగా బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో కాకినాడ జేసీ ప్రవీణ్ ఆదిత్యను నియమించారు. జిల్లా ఏర్పాటు చేసిన 23 నెలల్లో ఇప్పటికి ఇద్దరు జేసీలు బదిలీ అయ్యారు. కలెక్టర్‌ను గత నెలలో బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న రామ సుందరరెడ్డి ఆకస్మిక బదిలీ చర్చనీయాంశమైంది.



ఏఎన్ఎంకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్

185 మంది వైద్య ఉద్యోగులకు క్రమబద్ధీకరణ ఉత్తర్వుల అందజేత

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 11 : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో క్రమబద్ధీకరణకు అర్హతలు సాధించిన 185 మంది వివిధ కేడర్ల కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను సోమవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అందజేశారు. తొలుత ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో సంబంధిత ఉద్యోగుల సర్టిఫికెట్లను, ప్రభుత్వ ఉత్తర్వులను మరోదఫా సరిచూసుకుని క్రమబద్ధీకరణ ఆదేశాలను అందజేశారు. ఎంపీహెచ్ఏ (మేల్,ఫీమేల్), ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు కలిపి మొత్తం 185 మందికి ప్రస్తుతం పనిచేస్తున్న ఆయా పీహెచ్‌సీల్లోనే రెగ్యులర్ ఉద్యోగులుగా ఇకమీదట కొనసాగుతారు. వీరంతా ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీనుంచి రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించబడతారని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వివరించారు. కాగా క్రమబద్ధీకరణకు ఇంకా మిగిలి వున్న 58 మంది ఉద్యోగులకు సంబంధించిన జీవోలు రాగల రెండురోజుల్లో విడుదల లయ్యే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఏవో మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు కౌన్సెలింగ్

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 11 : ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు బోధించేందుకు ఉద్దేశించిన స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ కేడర్ ఉపాధ్యాయ పదోన్నతుల కౌన్సెలింగ్ సోమవారం ఏలూరు డీఈవో కార్యాలయంలో జరిగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 8 పోస్టులుండగా నిర్ణీత అర్హతలు గల సెకండరీ గ్రేడ్ టీచర్లను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఆయా స్కూళ్ళకు అభీష్టాన్ని తెలియజేసిన వారికి పదోన్నతి నియామక పత్రాలను డీఈవో ఎస్.అబ్రహం అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే పదోన్నతి పొందినవారంతా ఆయా నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవస్థాపక చైర్మన్ సంపత్‌కుమార్

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇంజినీర్ విభాగం ఏర్పాటు

ఏలూరు రూరల్, మార్చి 11: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఇంజినీరింగ్ విభాగం ఏర్పాటు అయింది. సోమవారం ఏలూరులో కౌన్సిల్ సమావేశం జరిగింది. రాష్ట్రం మొత్తంమీద ప్రతి జిల్లా నుంచి లైసెన్స్‌డ్ ఇంజినీర్లు, ఆయా జిల్లాల అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ తరఫున నియమించినట్టు వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఇంజినీర్ విభాగంలో రాష్ట్ర చైర్మన్‌గా వేల్పుల రాము, రాష్ట్ర అధ్యక్షుడిగా ముని శ్రీనివాసరావు, సెక్రటరీగా కె.కమలాకర్‌రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బొందిలి శంకర్‌లను నియమించారు. నేషనల్ వైస్ చైర్మన్ జి.కృష్ణకిషోర్, కె.సత్యలక్ష్మి, గిరిప్రసాద్, సతీష్‌కుమార్, ఆవుల చైతన్య, కామేష్ యాదవ్, సురేష్‌బాబు,మూర్తి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న నిట్ కళాశాల విద్యార్థులు

దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటే..

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 11 : ఓటు వజ్రాయుధం లాంటిదని ఏపీ నిట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. ఏపీ నిట్ విద్యార్థులకు సోమవారం ఓటుహక్కుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వీరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటే అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరూ తప్పని సరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికలలో ఓటుకి నోటు తీసుకోకుండా సమాజానికి మేలు చేసే నాయకులను ఎన్నుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఓటు హక్కుపై తల్లిదండ్రులతో పాటూ, చుట్టుపక్కల వారిని కూడా చైతన్య పరచాలన్నారు. క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

నరసాపురం డీఎస్పీగా శ్రీనివాస్



నరసాపురం, మార్చి 11 : నరసాపురం డీఎస్పీగా జి.శ్రీనివాసును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన విజయవాడ నుంచి ఇక్కడికి వస్తున్నారు. ఇప్పటివరకు పనిచేసిన డీఎస్పీ మనోహ రాచారి తిరుపతి ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 2022లో ఆయన నరసాపురం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. సబ్ డివిజన్‌లో అనేక కీలక కేసుల్ని ఛేదించారు.

మురుగు పారే దారేది ?



పూడుకుపోయిన వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ప్రధాన డ్రెయినేజీ

డ్రెయినేజీ అస్తవ్యస్తం.. పేరుకుపోయిన చెత్త

గూడెం ప్రజలకు ఏళ్ల తరబడి అవస్థలు



28వ వార్డులో నిలిచిపోయిన మురుగు నీరు

తాడేపల్లిగూడెం అర్బన్ , మార్చి 11 :తాడేపల్లిగూడెం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మురుగు నీరు వెళ్ళే ప్రధాన డ్రైనేజీలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు పారక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో వన్‌టౌన్‌కు సంబంధించి మురుగు నీరు వెళ్ళే డ్రైనేజీ తాలూకా సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎస్‌బీఐ బ్యాంక్ , ఎల్ఐసీ , రైల్వే ట్రాక్ సమీపం నుంచి కడకట్ల రైల్వే గేటు దాటి ఏలూరు కాలువలో కలుస్తుంది. అయితే ఈ డ్రైనేజీ చెత్త చెదారంతో పూర్తిగా నిండి పోవడంతో నీరు సరిగా వెళ్లడం లేదు. ముఖ్యంగా రైల్వే ట్రాక్ సమీపంలో ఈ డ్రైనేజీ మొత్తం చెత్త, ముళ్ళ పొదలతో నిండిపోయింది. రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న దొమ్మర కాలనీ(28 వ వార్డు) ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలం అయితే పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని, చిన్నపిల్లలతో నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.టూటౌన్ ప్రాంతానిది కూడా ఇదే సమస్య. ఇక్కడి మురుగు నీరంతా పెంటపాడు సమీపంలో ఉన్న మురుగు కాలువలో కలుస్తుంది. ఇది కూడా పూడుకు పోవడంతో నీరు సరిగా వెళ్లక ఈ ప్రాంతవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.తూడు కారణంగా మురుగు కాల్వలో నీరు లాగక పోవడంతో వర్షాకాలంలో నీరు పక్కనే ఉన్న పొలాల్లోకి చేరి పొలాలు మొత్తం మునిగి పోతున్నాయి. దీంతో రైతులు తమ పొలాలకు గండ్లు కొట్టి పక్కనే ఉన్న మిడ్ లెవిల్ కాలువలోకి నీరు వదిలేసేవారు. దీంతో ఇరిగేషన్ అధికారులకు, రైతులకు మధ్య పలు మార్లు వాగ్వాదాలు కూడా చోటు చేసుకున్నాయి. అధికారులు ఈ వేసవిలో తూడు తొలగించి నీరు వెళ్ళేలా చూడాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుకుంటున్నారు.

దోమలతో ఇబ్బందులు



మురుగు నీరు పారక చాలా ఇబ్బందులు పడుతున్నాం.ఈ పరిస్థితి చాలా రోజుల నుంచి ఉంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నీరు ఇళ్ల వద్ద నిలిచిపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

-పసుపులేటి సుబ్బమ్మ, తాడేపల్లిగూడెం 28వ వార్డు

అధికారులు స్పందించాలి



ప్రధాన డ్రైనేజీ మొత్తం పూడుకుపోయింది.దీంతో మురుగు నీరు వెళ్లడం లేదు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. మురుగు నీరు ఇళ్ల వద్దే ఉండిపోవడంతో జ్వరాల బారిన పడుతున్నాం. ప్రధాన డ్రైనే జీలో పూడికలు తొలగిస్తే గాని పరిస్థితి చక్కబడదు. అధికారులు స్పందించి డ్రైనేజీలో పూడికలు తీయాలని కోరుతున్నాం.

-కొమ్మిరెడ్డి గౌరి, తాడేపల్లిగూడెం 28వ వార్డు



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్

ఓటుతో రాష్ట్రానికి మంచి భవిష్యత్ సాధిద్దాం

తణుకు, మార్చి 11: ఒక్క ఓటుతో రాష్ట్రానికి మంచి భవిష్యత్ సాధిద్దామని విశ్రాంత ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసు అన్నారు. సోమవారం సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో పార్ల మెంటరీ ఎన్నికలు- పౌర సంఘాల కర్తవ్యం అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజికవేత్త డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, వైసీపీలు తమ స్వప్రయోజనాలు కోసం రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నాయని ప్రత్యేక హోదా అమలు కాకపోవడానికి బీజేపీతో ఆ పార్టీలు కుమ్మక్కు కావడమే కారణమన్నారు. బలమైన పార్లమెంటు అభ్యర్థులకు ఓటు వేసి దేశ రాజకీయాలను మార్చుకోవాలన్నారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్తు సాధించుకోవాలన్నారు. సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు పోరూరి మురళీకుమార్ పార్లమెంట్ అభ్యర్థికి వేసే ఓటుతో దేశ రాజకీయాన్ని మారుద్దాం, రాష్ట్రానికి మంచి భవిష్యత్‌ను సాధించుకుందాం నినాదంతో రూపొందించిన కరపత్రం ఆవిష్కరించారు. సమితి గౌరవాధ్యక్షుడు అంబేడ్కర్, మాల్యాద్రి, వెంకటేశ్వర రావు, అబ్బయ్య, డాక్టర్ ఆలపాటి శ్రీనివాసు, కృష్ణారావు, డాక్టర్ రమేష్ చంద్రబాబు పాల్గొన్నారు.

నా ఓటు ఏమైంది.. ?



ఆకివీడు, మార్చి 11: ఓటర్ల జాబితాలో ఆకివీడు రెండో వార్డుకు చెందిన బెజవాడ రామసీత తన ఓటు కనపడక పోవడంతో అధికారులను ప్రశ్నించగా కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గత సార్వత్రిక ఎన్ని కలు, ఇటీవల నగర పంచాయతీ ఎన్నికలకు ఓటు వేశానని ప్రస్తుత జాబితాలో ఎందుకు తొలగించారని అధికారులను ప్రశ్నిస్తోంది.

ప్రశాంత వాతావరణంలో ఓటేయాలి

భీమవరం క్రైం, మార్చి 11 : ఎన్నికల్లో అధైర్యపడకుండా నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని పోలీసు అధికారులు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సోమవారం భీమవరం వన్‌టౌన్, పాలకొల్లు రూరల్, అత్తిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని పోలీసులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ సంసిద్ధంగా ఉందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

గూడ్స్ షెడ్డు ఆధునికీకరణ పనులకు నేడు శంకుస్థాపన

వర్చువల్ విధానంలో ప్రధాని ప్రారంభం

ఏలూరులో కార్యక్రమానికి గవర్నర్ హాజరు



ఏలూరు క్రైం, మార్చి 11 : ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లోని గూడ్స్ షెడ్డు ఆధునీకరణ పనులకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఏలూ రులో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 12వ తేదీ ఉదయం 12 గంటలకు హాజరు కానున్నారు. రైల్వే అధికారులు ఆర్‌పిఎఫ్, జీఆర్‌పీ, సివిల్ పోలీసులు, ఇంటిలిజెన్స్ అధికారులు, సెక్యూరిటీ అధికారులు సోమవారం సాయంత్రం ఏలూరు గూడ్స్ షెడ్డు ప్రాంతాలను బాంబ్ స్క్వాడ్‌లు, పోలీసు జాగిలాలతో పరిశీలన చేయించారు.

రాజకీయ పార్టీలు బ్రాహ్మణ వర్గాన్ని పట్టించుకోకపోవడం దారుణం

ఏలూరు రూరల్, మార్చి 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బ్రాహ్మణ కులాన్ని రాజకీయంగా దూరం పెట్టాలని చూస్తున్నాయని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ దేశమంతా బ్రాహ్మణులకు అవకాశాలు కల్పిస్తోందని ఆంధ్రాలో మాత్రం అన్యాయం చేస్తోందని విమర్శించారు. గతంలో నాలుగు సీట్లు ఇచ్చామని గొప్పగా చెబుతున్న వైసీపీ నేడు ఒక్కసీటు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. బ్రాహ్మణ సంఘాలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. విశాఖ, విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల్లో పోటీ చేయటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

శేషాచలంపై పాముకాటుకు గురైన భక్తుడు



చికిత్స పొందుతున్న బాధితుడు

ద్వారకాతిరుమల, మార్చి 11: చినవెంకన్న దర్శనానికి వచ్చి నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని పాము కాటు వేసింది. భయంతో అతను కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతనిని స్థానిక ప్రభు త్వాసుపత్రికి తరలించారు. గణపవరం మండలం బొమ్మిడికి చెందిన ఓరింకల ఏసు సోమవారం సాయంత్రం ద్వారకా తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించాడు. అనంతరం నడిచి కొండపై నుంచి దిగువకు వస్తుండగా టోల్‌గేట్ సమీపంలో పొదల నుంచి ఓ పాము రోడ్డు దాటుతూ నడిచి వెళ్తున్న ఏసును కాటు వేసింది భయంతో కేకలు వేయడంతో పరిసర ప్రాంతవాసులు వచ్చి అతడిని పీహెచ్‌సీకి తరలించగా అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. తరువాత మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపారు.



సోమేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సోమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.10.37 లక్షలు

భీమవరం టౌన్, మార్చి 11 : పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వర జనార్ధనస్వామి ఆలయంలో 58 రోజులకు గాను హుండీ ఆదాయం లెక్కించగా 10 లక్షల 37 వేల 912 రూపాయలు వచ్చిందని ఈవో రామకృష్ణంరాజు తెలిపారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి సుబ్బారావు పర్యవేక్షణలో, ఈవోలు డి.రామకృష్ణం రాజు, భక్తులు, ధర్మకర్తలు, గ్రామస్థుల సమక్షములో లెక్కింపు నిర్వహించారు. సభ్యులు కూర్మదాసు, సత్యశ్రీనివాస్, శ్రీవల్లి, త్రిమూర్తులు, రఘుబాబు, సూర్యప్రకాష్, లీలా ఈశ్వరి, రామకృష్ణ ఉన్నారు.

నత్తారామేశ్వరంలో 7.18 లక్షలు

పెనుమంట్ర, మార్చి 11 : పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలోని రామ లింగేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా 7 లక్షల 18 వేల 049 రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో గంగా శ్రీదేవి తెలిపారు. హుండీల వల్ల 3 లక్షల 24 వేల 496 రూపాయలు, విరాళాల ద్వారా 3 లక్షల 93 వేల 553 రూపాయలు వచ్చిందని తెలిపారు.



ఆచంటలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

ఆచంట, మార్చి 11: ఆచంట రామేశ్వరస్వామి మహాశివరాత్రి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి.ఆఖరి రోజున స్వామివారికి పుష్పోత్సవం నిర్వహించారు. ప్రసాదంతో పాటు చినమల్లంకు చెందిన నెక్కంటి బుచ్చేశ్వర రావు, కృష్ణవేణి దంపతులు అమ్మవారి కుంకు భరిణలు పంచి పెట్టారు. దీంతో ఆలయం మహిళా భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎస్ఐ ఎం. రాంకుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించగా ఆలయ చైర్మన్ సాగర్, ఆలయ అధికారి రాము, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన శివదేవుని కల్యాణ మహోత్సవాలు



ద్వారకాతిరుమల, మార్చి 11: శ్రీవారి శేషాచలకొండపై కొలువై క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో శివదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలు సోమవారం రాత్రి జరిగిన విశేష కార్య క్రమాలతో ముగిశాయి. ఉదయం, స్వామివారికి అభిషేకాలను అర్చకుల వేద మంత్రోచ్ఛరణల నడుమ జరిగాయి. రాత్రి శ్రీపుష్పయాగోత్సవాన్ని ఆలయ అర్చకులు, పండితులు వేడుకగా నిర్వహించారు.

పవన్ శాసనసభకే పోటీ చేయాలి : జోగయ్య

పాలకొల్లు, మార్చి, 11 :పవన్ కళ్యాణ్ పార్లమెంట్‌కు పోటీ చేయాలనే ప్రయత్నాన్ని విరమించుకోవడం మంచిదని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య సోమవారం ఒక లేఖ విడుదల చేశారు. రాష్ట్ర పాలనలో భాగస్వామ్యం కావాలంటే శాసనసభకు పోటీ చేయడమే మేలన్నారు. గతంలో చిరంజీవి అనుభవం చూస్తే తెలుస్తుందన్నారు.శాసనసభకు పోటీ చేయకపోతే భవిష్యత్తులో లోకేష్ కోసం జనసేనను తెలుగుదేశంలో విలీనం చేయడం తప్పదనే దుష్ప్రచారం మొదలవుతుందన్నారు.

జగన్నాథపురంలో వైసీపీ అక్రమ తవ్వకాలు

అడ్డుకున్న గ్రామస్థుడిపై కేసు



చెరువు దగ్గర నిలుపుదల చేసిన ఎక్స్‌కవేటర్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 11: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో రాత్రి సమయంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తుండగా గ్రామానికి చెందిన యర్రసాని శ్రీను, పలువురు గ్రామస్థులు అడ్డుకున్నారు. నాలుగు ట్రాక్టర్‌లు, జేసీబీని పట్టుకుని అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ నిధులతో రోడ్లు వేసి అక్రమంగా చెరు వుల్లో గ్రావెల్ తవ్వడంపై తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేశారు. వైసీపీ నాయ కులు గ్రామంలో ఇష్టారాజ్యంగా వ్యవహ రిస్తూ ప్రజాధనాన్ని దోచు కుంటున్నా రన్నారు. చెరువు సబ్ లీజుకు తీసుకున్న తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఇష్టారీతిగా తవ్వడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రెడ్డిని వివరణ కోరగా తమ పంచాయతీ చెరువును తవ్వుకునే హక్కు తమకు ఉందని పంచాయతీలో అభివృద్ధి పనుల కోసం గ్రావెల్ వినియో గించు కునేందుకు తరలిస్తుండగా అడ్డుకున్నందుకు కేసు పెట్టామన్నారు.

కుక్కల మంద దాడి.. 11 మేక పిల్లల మృతి



చాట్రాయి, మార్చి 11: మండలంలోని చనుబండలో మోదుగు జోజి మేకల దొడ్డిపై సోమవారం కుక్కల మంద దాడి చేసి 11 మేక పిల్లలను చంపేశాయి. చనిపోయిన మేక పిల్లలను చూసి యాజమాని కుటుంబీకులు భోరున విలపించారు. గ్రామాల్లో కుక్కల సంఖ్య పెరిగి మందలుగా సంచరిస్తూ గొర్రెలు, మేకల దొడ్లపైనా, మనుషులపైనా దాడులకు తెగబడుతున్నాయని, అధికారులు స్పందించి కుక్కలను పట్టించి దూర ప్రాంతాల్లో అడవులకు తరలించాలని బాధితులు కోరుతున్నారు.

ఎన్ఆర్‌పీ అగ్రహారం పెడయ్యకోడులోకి దూసుకుపోయిన కారు



ఉండి, మార్చి 11 : భీమవరం నుంచి ఉండి వైపుకు వేగంగా వస్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పెడయ్య కోడులోకి దూసుకుపోయింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం భీమవరం నుంచి ఉండి మీదగా వస్తున్న కారు ఎన్ఆర్‌పీ అగ్రహారంలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి పెడయ్య కోడులోకి దూసుకుపోయింది. కారు డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

శివరాత్రి ఉత్సవాల్లో రెచ్చిపోయిన యువత.. పలువురికి గాయాలు

ఆచంట, మార్చి 11: ఆచంట రామేశ్వరస్వామి వారి మహా శివరాత్రి ఉత్సవాలో ఐదు రోజులు పాటు అత్యంత వేడుకగా జరిగాయి. ఉత్సవాలు పేరు చెప్పి ప్రతీ ఏటా ఏదొక గొడవలు జరగడం పరిపాటిగా మారింది. ఈ సారి కూడా యువత మద్యం సేవించి గొడవలు సృష్టించారు. శివరాత్రి రోజున ఇద్దరు యువకులు గొడవపడి బ్లేడుతో కోసుకోగా వారికి గాయాలయ్యాయి. ఆఖరి రోజున ఆదివారం రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన ఒక ప్రోగ్రామ్‌లో యువకులు రెచ్చి పోవడంతో చివరకు పోలీసులు జోక్యం చేసుకుని ప్రోగ్రామ్ నిలుపుదల చేసి యువకులను కంట్రోల్ చేశారు. శివరాత్రి ముందు రోజున ఆచంట మార్టేరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉత్సవాల పేరు చెప్పి యువకులు మద్యం సేవించి గొడవలకు ముఖ్య కారకులవుతున్నారు. పోలీసులు సైతం నియంత్రించలేని పరిస్థితి ఎదురవుతోంది. ఉత్సవాలు ఐదు రోజులు పాటు గొడవలు చోటుచేసుకోవడం పలువురు గాయాలపాలవడం జరిగింది.

క్రైం కార్నర్

పొరుగు రాష్ట్రాల మద్యం స్వాధీనం



తణుకు, మార్చి 11 :అరుణాచల ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లు అక్రమంగా దిగుమతి చేసు కున్నారని ఇద్దరు వ్యక్తులను తణుకు పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వద్ద విలే కరుల సమావేశంలో తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి వివరాలను వెల్లడించారు. అరుణా చల్‌ప్రదేశ్ మద్యంతో తణుకు డంపింగ్ యార్డుకు వెళ్ళే ఖాళీ ప్రదేశంలో ఉన్న ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన బోయిన బాలాజీ, రాజమహేంద్రవరానికి చెందిన తుమ్మల రాధాకృష్ణలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 220 మద్యం బాటిళ్ళు కారు, ఆటోతో పాటు ఆరువేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన ఇజ్జాడ పాపినాయుడు, అత్తిలి మండలం ఉరదాళ్ళపాలెంకు చెందిన మాకా రాజేష్, ఇరగవరం మండలం ఇల్లింద్రపర్రుకు చెందిన గండ్రోతులు యేసుబాబులు పరారీలో ఉన్నారని చెప్పారు. పట్టణ సీఐ నాగరాజు, ఎస్ఐ కె.శ్రీనివాసు, పీసీలు జి.శ్రీనివాసు, టి.రవి, ఎస్‌కె అక్బర్‌లాల్, ఆర్ఎండీవీ ప్రసాదు, డి.వెలగేల శ్వరరావు, ఎంపీ శివాజీ, జి.మురళీలను అభినందించారు.

విద్యుదాఘాతానికి యువకుడు మృతి

ఉండి, మార్చి 11 : విద్యుత్ షాక్‌కు గురై ఒక యువకుడు మృతి చెందగా మరొక వ్యక్తి గాయాలైనట్టు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. జార్కండ్ రాష్ట్రం సన్‌బాత్ జిల్లా నుంచి మాణిక్ బాహలీ నెలరోజుల క్రితం భీమవరం ప్రాంతంలోని చేపల వ్యాపారి వద్ద పనిచేయడానికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం ఉండి-గణపవరం రహదారిలోని రొయ్యల ప్రాసెసింగ్ షెడ్డులో విద్యుత్ మోటర్ ఏర్పాటు చేసేందుకు కొబ్బరిచెట్టుకు ఐరన్ నిచ్చెన వేసుకుని పనులను చేస్తున్నాడు. మరొక వ్యక్తి చందనకుమార్ నిచ్చెన పట్టుకుని వున్నాడు.పైన వున్న విద్యుత్ వైర్లు తగిలడంతో మాణిక్ కిందపడిపోయాడు. కింద వున్న వ్యక్తికి షాక్ తగిలింది. ఇద్దరినీ భీమవరం తరలించగా వైద్యులు మాణిక్ బాహలీ మృతిచెందినట్లు తెలిపారు. మరొక వ్యక్తి చందనకుమార్ ఆరోగ్య పరిస్థితి బాగానే వుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసులపై ఏసీబీ వల

డిపార్టుమెంట్‌కు చెందిన వ్యక్తి నుంచే రూ.25 వేలు లంచం డిమాండ్

చిక్కిన నరసాపురం ఎస్సై, రైటర్, హోంగార్డు

రాజమహేంద్రవరం తరలింపు

నరసాపురం, మార్చి 11 : నరసాపురం పోలీస్ స్టేషన్‌పై సోమవారం ఏసీబీ అధికారులు దాడులు చేసి ఎస్ఐ బీఎస్‌డీఆర్ ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావును వలపన్ని పట్టుకున్నారు. బాధితుడి నుంచి రూ.25 వేలు లంచం తీసుకున్న జీపు డ్రైవర్ ప్రసాద్ లొంగిపోయాడు. ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపిన వివరాలివి.. విజయవాడకు చెందిన విజయసాగర్‌కు నరసాపురం పట్టణానికి చెందిన యువతితో వివాహమైంది. ఇటీవల ఇతనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో 498 కేసు నమోదైంది. అతని తండ్రి హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కేసు నమోదు కాగానే ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి తనపై, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసు పెట్టారని, న్యాయం చేయాలని కోరాడు. దీనికి ఎస్ఐ రూ.20 వేలు, రైటర్ నాగేశ్వరరావు తనకు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం ఇస్తేనే కేసులో కొందరి పేర్లను తొలగిస్తామని లేకపోతే యధావిధిగా ఉంచుతామని బెదిరించారు. దీనిపై విజయసాగర్ ఏలూరు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బాధితుడికి రూ.25 వేలు నగదు ఇచ్చి స్టేషన్ సమీపంలో మాటేశారు. లంచం సొమ్మును ఇచ్చేందుకు ఎస్ఐ వద్దకు వెళ్లితే డ్రైవర్‌కు అందించాలని చెప్పాడు. సొమ్మును తీసుకున్న డ్రైవర్ జీపులో పెట్టగానే మాటు వేసిన ఏసీబీ పోలీసులు ఒక్కసారిగా దాడిచేశారు. దీంతో ఉల్కికిపడ్డ డ్రైవర్ పరుగులు తీశాడు. గుర్తించిన ఎస్ఐ, రైటర్లు బయటకు పరుగులు తీశారు. ఏసీబీ పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. జీపు డ్రైవర్, హోంగార్డు ప్రసాద్ సాయంత్రం ఏసీబీ అధికారుల వద్ద లొంగిపోయాడు. వీరిపై కేసులు నమోదు చేసి రాజమండ్రి తరలించారు. ఈ దాడుల్లో సీఐ సతీష్, ఎస్ఐ ఎస్వీ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.





ఏసీబీకి చిక్కిన ఎస్ఐ ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావు



పట్టుబడిన సొమ్ముతో ఏసీబీ అధికారులు

ఉలిక్కిపడ్డ పోలీసులు..

కొంతకాలంగా నరసాపురం పోలీస్ సర్కిల్ లోని కొన్ని స్టేషన్లపై తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కొందరు మధ్యవర్తులుగా కేసులు డీల్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నేరుగా లంచాలు తీసు కోకుండా మధ్యవర్తుల ద్వారానే వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఈ ఆరోపణలు టౌన్ పోలీస్ స్టేషన్‌పై లేకపోలేదు. ఈ క్రమంలో ఏసీబీ దాడులు చేయడం పట్టణంలో సంచలనమైంది.

గుర్తు తెలియని వ్యక్తి దాడి..మహిళకు గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గ

జంగారెడ్డిగూడెం, మారిచ 11 : గుర్తు తెలియని వ్యక్తి దాడిలో ఒక మహిళ గాయపడిన సంఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సీఎస్ఆర్ మాల్ వెనుక ఒక పాఠశాల సమీపంలో మండ దుర్గ నివాసం ఉంటోంది. ఆమె భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తీయగా, ముఖానికి ముసుగు వేసుకున్న వ్యక్తి ఎదురు పడటంతో తన మనమడు అనుకుని మాట్లాడటానికి ప్రయత్నించింది. అయితే గుర్తు తెలియని ఆ వ్యక్తి తన వెంట తెచ్చుకున్న కత్తితో దుర్గ మెడపై పెట్టి బెదిరించాడు. దుర్గ ప్రతిఘటిస్తూ కత్తిని పట్టుకోవడంతో ఆమె రెండు చేతులకు గాయాలయ్యాయి. దుర్గ బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించి ఆ వ్యక్తి పరారయ్యాడు. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గను డీఎస్పీ రవిచంద్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

కైకరం సచివాలయంలో ఇన్వెర్టర్ చోరీ

ఉంగుటూరు, మార్చి 11 : ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలోని సచివాలయం-2లో ఇన్వెర్టర్ చోరీకి గురైందని కార్యదర్శి తెలిపారు. వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో సోమవారం ఉదయం సచివాలయం-2 తలుపులు తీసి ఉండడాన్ని గమనించి కార్యదర్శి సుబ్రహ్మణ్యం చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పోలవరంలో బ్యాంకు వద్ద స్వయం సహాయక సంఘాల మహిళలు

ఆసరా సొమ్ములేవి జగనన్నా..

స్వయం సహాయక సంఘాల మహిళల ఆవేదన

పోలవరం, మార్చి 11 : వైఎస్సార్ ఆసరా పేరిట గత జనవరిలో ముఖ్యమంత్రి జగన్ ఆర్భాటంగా బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో సొమ్ము జమ చేశామన్నారు. నేటికీ డ్వాక్రా సంఘాల మహిళలకు అందడం లేదని సోమవారం మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎంసీ డైరెక్టర్ మున్నీసా మాట్లాడుతూ ఆసరా సొమ్ము, సున్నా వడ్డీ మొత్తం రాలేదని మహిళలు చెప్పడంతో బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించామన్నారు. మండలంలో 12 వేల మహిళా సంఘాలకు మరో రెండు రోజుల్లో ఆసరా సొమ్ము జమ చేస్తామన్నారని చెప్పారన్నారు. సున్నా వడ్డీ విషయమై ఏపీఎంను తెలుసుకోవాలని మేనేజర్ తెలిపారన్నారు.



పీవోకు వినతిపత్రం ఇస్తున్న కొండరెడ్లు

ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వండి : కొండరెడ్లు

బుట్టాయగూడెం, మార్చి 11: బుట్టాయగూడెం, వేలేరుపాడు మండలాల సరిహద్దులో అభయారణ్యానికి అనుకుని ఉన్న మోదేలు కొండరెడ్డి గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి అటవీశాఖ అధికారుల నుంచి అనుమతి ఇప్పించాలని కొండరెడ్లు కోరారు. ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం కొండరెడ్లు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకుడు కారం రాఘం, సర్పంచ్ కారం లక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి నివాస యోజనలో 20 కుటుంబాలకు ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. 18 కుటుంబాలవారికి రూ.70 వేలు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయన్నారు. ఇళ్లు నిర్మించుకోవచ్చని ఐటీడీఏ అధికారులు చెబుతున్నా అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని, అనుమతి ఇప్పించాలని వేడుకున్నారు. గ్రామంలో పలు సమస్యలను పీవోకు తెలిపారు. గ్రామానికి రహదారి సౌకర్యం, వీధిలైట్లు లేవని తెలిపారు. లంకపాకలలో ఓటువేసే విధంగా ఏర్పాట్లు చేస్తానని పీవో హామీ ఇచ్చారు. ఈ.భూషణం, బి.వినోద్, కెచ్చెల బాలకృష్ణారెడ్డి, కెచ్చెల రమేష్‌రెడ్డి, జి.ఎర్రపురెడ్డి, కె.ముక్కారెడ్డి, కె.లక్ష్మీ, కె.సీత పాల్గొన్నారు.

పీవో ఎం.సూర్యతేజ బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్షలను పరిశీలించారు. పరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలని ప్రిన్సిపాల్ హనుమాన్‌ను ఆదేశించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 11: జిల్లాలో ర్యాంప్ స్కీమ్‌గా చేపట్టిన మైక్రో, స్మాల్, మీడియం, ఎంటర్‌ప్రెన్యూర్స్ (ఎంఎస్ఎంఈ) సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వేపై సంబంధిత అధికారులు, ఎంపీడీవోలు, కమిషనర్లతో సోమవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో తయారీ, సేవ, వాణిజ్యరంగాలకు సంబంధించి 74వేల సర్వీసులకు సర్వేచేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువచ్చి ఎంఎస్ఎంఈకు అనుసంధానం చేయించాలన్నారు. ఇటీవల చేపట్టిన సర్వేలో ఇంతవరకు 1590 పూర్తి అయిందని, మిగిలిన సర్వే ప్రక్రియ మూడు రోజుల్లో ప్రగతిలోకి తీసుకురావాలన్నారు. జేసీ బి.లావణ్యవేణి మాట్లాడుతూ అందరికి ఇళ్లు సంబంధించి ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఏలూరు డివిజన్‌లో 3451 అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయని, మిగతా వాటిని త్వరితగతిన ముగించాలన్నారు. డీఆర్వో పుష్పమణి, ఆర్డీవో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ కౌశల్ యోజన వినియోగించుకోవాలి



సమావేశంలో వెంకటేశ్వరరావుకు సత్కారం

ఉంగుటూరు, మార్చి 11: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌశల్ యోజన సద్వినియోగం చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సలగాల వెంకటేశ్వరరావు అన్నారు. గోపీనాథపట్నంలో ఆదివారం రాత్రి మండల స్థాయి సమావేశం జరిగింది. మండల గౌరవాధ్యక్షుడు గనుమోజు వెంకటరమణ మాట్లాడుతూ కుల వృత్తుల వారిగా కార్మిక బీమాను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో రాయలవరపు వెంకట వీరాంజనేయులు, కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు, కోశాధికారి దేవాదుల సత్య శంకర్, దాసు పెద్దిరాజు, కిల్లంపల్లి శ్రీనివాసరావు, లావేటి వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు చిరు ధాన్యాలు మేలు



పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీ

జంగారెడ్డిగూడెం, మార్చి 11 : గర్భిణులు, బాలింతలకు చిరు దాన్యాలతో కూడిన ఆహారం మేలు అని సీడీపీవో పి.బ్యూలా అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. బ్యూలా మాట్లాడుతూ చిరు దాన్యాలతో కూడిన ఆహార పదార్థాల వలన రక్త శాతం పెరిగి ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వడానికి ఎంతో దోహదపడతాయన్నారు. సూపర్‌వైజర్ లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి గీత, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, ప్రీస్కూల్ చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో ఐఎంఏ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు రూరల్, మార్చి 11: శనివారపుపేటలో ఐఎంఏ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్లనాని సోమవారం శంకుస్థాపన చేశారు. ఏలూరులో అభివృద్ధి, సంక్షేమం కోసం వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని, ఈ మేరకు ఐఎంఏ హాల్‌భవన నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు ఆయన తెలిపారు.

స్థలం విషయమై వివాదం

ఐఎంఏ హాల్ భవన నిర్మాణ స్థలంపై వివాదం నెలకొంది. కామన్‌సైట్‌లో పార్క్ కోసం వదిలిన స్థలం ఐఎంఏ హాల్ నిర్మాణానికి కేటాయించడంతో స్థానికులు అడ్డు చెప్పారు. పార్క్ స్థలంలో భవననిర్మాణం వద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే బడేటి బుజ్జి ఆ స్థలాన్ని మెరకచేయించారని తెలిపారు. ఇప్పుడు భవన నిర్మాణానికి ఇవ్వడం తగదన్నారు. ఎమ్మెల్యే నాని స్పందిస్తూ ఎవరికి ఇబ్బంది లేకుండా పక్కనే ఉన్న స్థలాన్ని పార్క్‌కు కేటాయిస్తామని, అభివృద్ధిచేస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు శాంతించారు.

పట్టణంలో తాగునీటి సమస్య నివారిస్తాం

జంగారెడ్డిగూడెం మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ లక్ష్మి



జంగారెడ్డిగూడెం, మార్చి 11: పట్టణ ప్రజలకు వేసవిలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కారంపై అధికారులతో చర్చించారు. చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ పట్టణ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వీధిలైట్లు, రోడ్లు, డ్రెయిన్‌లు తదితర మౌలిక సమస్యలు తీర్చేందుకు కౌన్సిల్ కృషి చేస్తుందన్నారు. రానున్న వేసవిలో మంచినీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులకు, వాటర్ వర్క్స్ సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు. మంచినీటి అవసరాలు ముందుగానే గుర్తించి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పలు అభివద్ధి కార్యక్రమాలపై అజెండాలో పేర్కొన్న అంశాలపై సమావేశం తీర్మానం చేసింది. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న చంటి



కార్యకర్తలతో సమావేశమైన సొంగా రోషన్‌కుమార్

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజా సంకల్ప యాత్రలో బడేటి చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 11: టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో జగన్‌కు నిద్రపట్టక పిచ్చిగా మాట్లాడుతున్నాడని ఏలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 20వ డివిజన్‌లో సోమవారం చంటి పర్యటించారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే కూటమికి ఘన విజయం సాదించిపెట్టాలని పిలుపునిచ్చారు. మూడుపార్టీల కలయికతో వైసీపీ నాయకులకు కళ్లఎదుటే వారి పతనం కనిపిస్తుందన్నారు. పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే తనను ఎన్నుకోవాలని చంటి అభ్యర్థించారు. కార్యక్రమంలో కె.ఉమామహేశ్వరరావు, ఎ.ఉమాశంకర్, ఆర్‌కే.ప్రసాద్, బాబ్జీ, వాసు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మఠంగూడెంలో తెలుగుదేశం - జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలను కలిసి ఎన్నికల్లో తనను గెలిపించాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు. అనంతరం గ్రామంలోని నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశంపార్టీని గెలిపించకపోతే రాష్ట్రం అథోగతిపాలు అవుతుందన్నారు. నా ఎస్టీలు, నా బీసీలు అంటూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గోదావరిలో కలపాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, చింతలపూడి ఎత్తిపోతల పథకం ముందుకు సాగాలన్నా చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. అనంతరం మండలంలోని ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడంపై చర్చించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, జగ్గవరపు ముత్తారెడ్డి, శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.





ఏలూరులో ఎస్‌బీఐ మేయిన్ బ్రాంచ్, జంగారెడ్డిగూడెం పట్టణంలో బ్యాంక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

రాజకీయ పార్టీల విరాళాలు వెల్లడించాలి

ఏలూరు టూటౌన్, మార్చి 11: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలు వెల్లడించాలని సీపీఎం నగర కార్యదర్శి పి.కిశోర్ డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ మేయిన్ బ్రాంచ్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఒక అంచనా ప్రకారం రాజకీయ పార్టీలన్నిటికి 16,437 కోట్ల రూపాయలు విరాళాలు వచ్చాయన్నారు. దీనిలో అధిక శాతం బీజేపీకే వచ్చాయన్నారు. సుప్రీం తీర్పు మేరకు ఎలక్ట్రోలర్ బాండ్ల వివరాలు తక్షణమే వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌వీడీ ప్రసాద్, శ్రీనివాస్, ఆదిశేషు, కనకారావు, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఎన్నికల బాండ్‌ల వివరాలను వెల్లడించాలనీ సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఎస్‌బీఐ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల బాండ్‌ల వివరాలు ఎన్నికల కమిషన్‌కు వెల్లడించాలని, బీజేపీ నిరంకుశ విధానాలు నశించాలని నినాదాలు చేస్తూ బ్యాంకు వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్‌ల రూపంలో కోట్లాది రూపాయలు కార్పొరేట్ సంస్థలు పెట్టుబడిదారులు బీజేపీ ప్రభుత్వానికి అందిస్తున్నారని ఆరోపించారు. ఎస్‌బీఐ ద్వారా బాండ్లు ఉండటంతో ఏ పార్టీలకు ఎవరు ఎన్ని డబ్బులు ఇచ్చారో వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా మూడు నెలల వరకు సమాచారం ఇవ్వలేమని బ్యాంకు యాజమాన్యం చెప్పడాన్ని ఖండించారు. బీజేపీ మళ్లీ అధికారం చేపట్టాలని దురుద్దేశంతో వేల కోట్ల రూపాయలు సేకరిస్తుందని ధ్వజమెత్తారు. గోపి, సూర్యారావు, ఎస్‌కె సుభాషిణి, షేక్ మహబూబ్ సుభాని, అందుగుల ప్రభాకర్‌రావు, జి.మణి. బి.గంగరాజు, డి.వెంకటేశ్వరరావు, ఎన్.భద్రం, కె.సునీల్ కె.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టుపై గిరిజనుల నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

బుట్టాయగూడెం, మార్చి 11: ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి అక్రమ అరెస్టుపై గిరిజనులు మండిపడ్డారు. చంద్రాయిగూడెంలో మండల ప్రధాన కార్యదర్శి కొవ్వాడయ్య ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులు నిరసన తెలిపారు. ఇతర కులస్తులను, గిరిజనేతర కులాలను ఎస్టీలో చేర్చవద్దని అమరణ దీక్ష చేస్తున్న వాబయోగిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వాబయోగిని వెంటనే విడుదల చేయాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. పండువారిగూడెంలో కూడా గిరిజనులు నిరసన తెలిపారు. పండు జగదీష్, రాజేంద్రప్రసాద్, దుర్గారావు, బాలరాజు, వంశీ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పెదపాడు, మార్చి 11: అప్పనవీడు జడ్పీ హైస్కూల్‌లో 80 మంది పదో తరగతి విద్యార్థులకు కల్వరి శక్తి మిషన్ ఆధ్వర్యంలో ప్యాడ్, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను సోమవారం అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలని కోరారు. హెచ్ఎం తోట పుష్పవతి, త్సవటపల్లి భారతి, వీరయ్య, విష్ణువర్ధన్, భాస్కరరావు, రవిచంద్రమోహన్, రమేష్, విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 11 : కేంద్ర, రాష్ట్రప్రభుత్వ డిఫెన్స్, పోలీస్ ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షలకు దరఖాస్తుదారులకు సీఎస్ఐ స్కూల్ ప్రాంగణంలో ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సతీష్ సావిత్రి సరెళ్ళ, ఏలూరు కార్యదర్శి హుస్సేన్ సోమవారం వివరాలు తెలిపారు. ఆర్పీఎఫ్, ఏపీ ఫారెస్టు బీట్ ఆఫీసర్, ఎన్డీఏ, ఎస్ఎస్‌సీ, ఆర్మీ ఉద్యోగాలకు దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్‌లలో లాంగ్‌టెర్మ్ శిక్షణ నిర్వహిస్తామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హతలుగల అభ్యర్థులు ఈ నెల 11నుంచి రిజిస్ట్రేషన్ నిమిత్తం తమ పేర్లను ఫోన్‌నెంబరు 81439 74622లో నమోదు చేసుకోవాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఏలూరు టూటౌన్, మార్చి 11: కావూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, టైపులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పీఆర్వో పులి శ్రీరాములు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులకు టైపు, డీసీఏ, డీటీపీ, ఇంటర్‌కామర్స్‌లో ఉత్తీర్ణులైన వారికి టాలీలో శిక్షణ ఇస్తామన్నారు. గ్రామీణ ప్రాంత యువకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ నెల 18 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

పాఠశాలకు రూ.25వేలు విలువైన కూలర్

కుక్కునూరు, మార్చి 11 : మండల పరిధిలోని అమరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 పదో తరగతి విద్యార్థులు రూ.25వేలు విలువ చేసే వాటర్ కూలర్‌ను సోమవారం పాఠశాలకు అందజేశారు. విద్యార్థులకు చల్లటి మంచినీరు అందజేయాలనే ఉద్దేశ్యంతో వాటర్ కూలర్‌ను అందజేసినట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు. తాము చదువుకున్న పాఠశాలకు సౌకర్యాలు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

ఇఫ్తార్ జావ సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న పెదబాబు

ఏలూరు రూరల్, మార్చి 11: నగరంలోని మసీదు పెద్దలకు రూ.5లక్షలు విలువచేసే ఇఫ్తార్ జావ సరుకులను ఎస్ఎంఆర్ పెదబాబు సోమవారం అందజేశారు. రంజాన్ పండుగ సందర్భంగా మేయర్ క్యాంపు కార్యాలయంలో పెదబాబు ఆధ్వర్యంలో నగరంలోని 27 మసీదులకు 30 రోజులకు సరిపడా రవ్వ, ఆయిల్, పెసర పప్పును అందజేశారు. పదేళ్లుగా రంజాన్‌కు నగరంలో మసీదులకు సరుకులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇలియాజ్ భాష, అంజుమన్ సంస్థ పెద్దలు నగరంలోని పలు మసీదులకు చెందిన ఇమామ్‌లు, మౌజన్లు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలు

పోలవరం, మార్చి 11: రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలకు సిద్ధం కావాలని అహెలె సున్నత్ జమాతె మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండి యాసీన్ షరీఫ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో నిత్యం మసీదులో పవిత్ర ఉపవాస ప్రార్థనలు, ఇఫ్తార్ విందులు ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతాయన్నారు. ఇతర మతస్తులు కూడా ఉపవాస దీక్షలలో పాల్గొని హిందూ ముస్లిం ఐక్యత చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఉపవాస ప్రార్థనలు, ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

పట్టిసీమ శివ క్షేత్రంలో భక్తుల రద్దీ



పూజలు చేస్తున్న భక్తులు

పోలవరం, మార్చి 11 : పట్టిసీమ శివ క్షేత్రానికి సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో రద్దీ కారణంగా రాలేకపోయిన భక్తులు సోమవారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పోలవరం పరిసర ప్రాంతాలతో పాటు తూర్పుగోదావరి జిల్లా సీతానగరం పరిసర ప్రాంతాల నుంచి భక్తుల ట్రాక్టర్లపై తరలి వచ్చారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచిత దర్శనం తీర్థప్రసాదాలు, అల్పాహారం, మంచినీటి సౌకర్యం కల్పించినట్లు ఆలయ సిబ్బంది వెంకట్రాజు తెలిపారు.

పోషణ పక్వాడా కార్యక్రమం

ఏలూరు రూరల్, మార్చి 11: ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆది ఆంధ్రా పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ మంగ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిలెట్స్ ఉపయోగం, వాటిని తీసుకోవాల్సిన ఆవశ్యకత వివరించారు. పోషకాహారం ప్రాధాన్యం తెలియజేశారు. గర్భవతులు, బాలింతలకు, తల్లులకు 100 రోజుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవీంద్రమణి, ఏఎన్ఎం బేగం, కిశోర బాలికలు, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





ఏలూరు నగరం, చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో సాయుధ బలగాల కవాతు

ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి

ఏలూరు క్రైం, మార్చి 11: ప్రజలు ఓటు హక్కు నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ అన్నారు. నగరంలోని వన్ టౌన్ ప్రాంతంలో సోమవారం సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. బడేటి చౌక్, పాండురంగ థియేటర్ సెంటర్, కత్తేపువీధి, దక్షిణపు వీధి, చిరంజీవి బస్టాండ్ సెంటర్, వంగాయిగూడెం మీదుగా గాంధీ బొమ్మ సెంటర్, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. సీఐ రాజశేఖర్ వివిధ కూడళ్లలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాజకీయపార్టీలపై అభిమానంతో ఇతర పార్టీల వారిని దూషించరాదని, ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఆటంకాలు సృష్టించినా, ప్రలోభాలకు గురిచేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సాయుధ బలగాలతోపాటు ఎస్ఐ లక్ష్మణబాబు, రూరల్ ఎస్ఐ రాజారెడ్డి వారి సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి: యర్రగుంటపల్లిలో సోమవారం కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ సుధాకర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు భరోసాగా సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రగడవరం, యర్రంపల్లి గ్రామాల్లో కూడా కవాతు నిర్వహించినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొయ్యలగూడెం టీడీపీ నాయకులు

అధిష్ఠానం నిర్ణయం మేరకే పనిచేస్తాం

టీడీపీ పోలవరం సీటుపై టీడీపీ నేతల నిర్ణయం

మరోవైపు బొరగం శ్రీనివాస్‌కే ఇవ్వాలని డిమాండ్

కొయ్యలగూడెం, మార్చి 11: పోలవరం సీటు ఎవరికి కేటాయించినా అధిష్ఠానం నిర్ణయం మేరకు కలిసి పని చేస్తామని టీడీపీ కొయ్యలగూడెం అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ అన్నారు. స్థానిక నాయకులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైకోరెడ్డిని గద్దె దించడం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ ఒకటయ్యాయన్నారు. పొత్తులో భాగంగా పోలవరం సీటు జనసేనకు కేటాయించారని ప్రచారం జరుగుతుందన్నారు. టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌కు సీటు రాకపోవడం బాధాకరమైనా అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి టీడీపీ, జనసేన విజయానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. బొరగం శ్రీనివాస్‌కు అధిష్ఠానం న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పులపల్లి వెంకట్రావు, దొడ్డపనేని దుర్గాదేవి, బలుసు నాగేశ్వరరావు, బెల్లాని శ్రీనివాస్, రాచూరి మదన్, నిమ్మగడ్డ రాంబాబు, మలిశెట్టి కేసుబాబు, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బొరగం శ్రీనివాస్‌ను ప్రకటించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ కోరారు. ఐదేళ్లుగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని, అధిష్ఠానం ఉమ్మడి అభ్యర్థిగా బొరగం శ్రీనివాస్‌కు టిక్కెట్టు ఇస్తే కూటమి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వీరాస్వామి, సాయి, శంకర్, దుర్గాప్రసాద్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: పోలవరం అసెంబ్లీ టిక్కెట్ బొరగం శ్రీనివాస్‌కే ఇవ్వాలని టీడీపీ ఎస్టీ సెల్ మండల నాయకులు ఎం.వెంకటకృష్ణ డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో టీడీపీ కార్యకర్తలకు నాయకులు ఎటువంటి సమస్య తలెత్తినా, ప్రమాదాలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి అండగా నిలిచిన బొరగంకు పోలవరం టీడీపీ టిక్కెట్ ఇవ్వాలన్నారు. పలువురు గిరిజనులతోపాటు పి.అంకంపాలెం, తాటియాకులగూడెం సర్పంచ్‌లు, జగ్గారావు, రాంబాబు, ఎంపీటీసీ నాలి శ్రీను, తదితరులు ఉన్నారు.

● పోలవరం: పోలవరం సీటు బొరగం శ్రీనివాసులుకే కేటాయించాలని టీడీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగిన కొండ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. గుబ్బా రాంబాబు, ఇల్లా సత్యనారాయణ తదితర నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేసిన బొరగం శ్రీనివాసులుకి సీటు కేటాయించాలన్నారు. పొత్తులో భాగంగా జనసేనతో కలిసి పనిచేయడానికి సిద్ధమేనని, బొరగంకు సీటు కేటాయిస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీటు ఎవరికిచ్చినా గెలిపించాలి : జయవరపు

టి.నరసాపురం: పొత్తు ధర్మం పాటించి సీటు ఎవరికిచ్చినా గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి అన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా ఏ పార్టీకి సీటు ఇచ్చినా గెలిపించడానికి పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాయకులు, కార్యకర్తలకు అధినేత సముచిత స్థానం కల్పిస్తారని ఆయన తెలిపారు.

అభ్యర్థి ఎవరైనా సహకరిస్తాం

కుక్కునూరు: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా నియోజకవర్గంలో ఎవరు పోటీ చేసినా విజయానికి కృషి చేస్తామని టీడీపీ నేత వంటిపల్లి గంగరాజు అన్నారు. టీడీపీ అధిష్ఠానం నిర్ణయం మేరకు పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. తాళ్లూరి సురేష్, గోలమూడి శ్రీను, కుక్కునూరు మురళి, భూపతిరాజు సురేష్‌రాజు తదితరులు ఉన్నారు.

మిత్రపక్షాలు పొత్తు ధర్మం పాటించాలి

కుక్కునూరు: పోలవరం జనసేనకు కేటాయిస్తే మిత్ర పక్షం పొత్తు ధర్మం పాటించాలని జనసేన నాయకుడు మంత్రి గోపాల కృష్ణ అన్నారు. పోలవరం జనసేనకు కేటాయించనున్న నేపథ్యంలో పలువురు టీడీపీ నాయకుల ప్రకటనలను ఆయన ఖండించారు. జనసేన కేవలం 24 సీట్లు తీసుకున్న విషయాన్ని, జనసేన అధినేతను టీడీపీ నేతలు అర్థం చేసుకోవాలన్నారు. మిత్రపక్షాలు కలసి పోరాడితేనే విజయం సాధిస్తారన్నారు.

వైసీపీకి ఓటు అడిగే హక్కు లేదు : దాసరి శేషు



విలేకరులతో మాట్లాడుతున్న దాసరి శేషు

జంగారెడ్డిగూడెం, మార్చి 11: మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానన్న జగన్ మాట తప్పి మడమ తిప్పాడని, వైసీపీకి ఓటు అడిగే హక్కు లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాసిరకం మద్యం పోసి 35 లక్షల మంది ఆరోగ్యాలు నాశనం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం మద్యం వల్ల కిడ్నీ, లివర్ చెడిపోయి 30వేల మంది ప్రాణాలు పోయి, కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. నాసిరకం మద్యంలో జగన్ లక్ష కోట్లు కమిషన్ కొట్టేశాడని, అందుకే డిజిటల్ పేమెంట్స్ లేకుండా చేశాడన్నారు. 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి మాట తప్పాడు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి మాట తప్పాడన్నారు. విద్యుత్ చార్జీలు పెంపు, ఉచిత ఇసుకను రద్దు చేసి వేల కోట్ల కుంభకోణంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. టీడీపీ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి పగడం సౌభాగ్యవతి, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతూరి అంబేడ్కర్ తదితరులు మాట్లాడారు. చింతలపూడి నియోజకవర్గ మీడియా కోర్డినేటర్ చెరుకూరి శ్రీధర్, చిత్తపురి దుర్గేష్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పులపాకుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వాణిజ్య విభాగం నేత దుర్గారావుకు సత్కారం



దుర్గారావును సత్కరిస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం, మార్చి 11: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తూటికుంట దుర్గారావు వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులు కావడంతో పలువురు సత్కరించారు. టీడీపీ నాయకులు సోమవారం ఘన సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గారావు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సొంగా రోషన్‌కుమార్, స్థానిక నాయకులు సహకరించి తనకు పదవి ఇవ్వడం సంతోషమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడి చంద్రబాబు, రోషన్‌కుమార్‌ను గెలిపించుకుంటామన్నారు. షేక్ ముస్తఫా, పొదలి పణిశర్మ, కొండేటి నాగు, తూటికుంట రాము, షేక్ యాకోబ్, వేములపూడి నాగరాజు, శివారెడ్డి హరికృష్ణ, పితాని సురేష్, మల్లవరపు విక్రమ్, భద్రాచలం జ్యోతికుమార్, పాకనాటి కాశీ దుర్గారావు, పాములు శ్రీనివాస్, బొంగు నాగేశ్వరరావు, పీడీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత ద్వారా రూ.10.05 కోట్ల పంపిణీ

చింతలపూడి, మార్చి 11: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత సొమ్ము పంపిణీ చేశారు. మండలంలో 5358 గ్రూపులకు 10.05 కోట్లు పంపిణీ చేసినట్లు వెలుగు ఏపీఎం జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసి నీరజ, వైసీపీ నాయకులు కె.విజయరాజు, పొన్నాల అనిత, తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

పెదవేగి, మార్చి 11: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, నిత్యార్చన పూజలు చేశారు. సాయంత్రం పార్వతీదేవి అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేస్తున్నామని అర్చకుడు తిప్పాభట్ల సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. మంగళవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

పోలీసులపై ఏసీబీ ట్రాప్

- డిపార్టుమెంట్‌కు చెందిన వ్యక్తి నుంచే లంచం డిమాండ్
- చిక్కిన నరసాపురం ఎస్సై, రైటర్, హోంగార్డు

నరసాపురం, మార్చి 11 : నరసాపురం పోలీస్ స్టేషన్‌పై సోమవారం ఏసీబీ అధికారులు దాడులు చేసి ఎస్ఐ బీఎస్‌డీఆర్ ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావును వలపన్ని పట్టుకున్నారు. బాధితుడి నుంచి రూ.25 వేలు లంచం తీసు కున్న జీపు డ్రైవర్ ప్రసాద్ లొంగిపోయాడు. ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపిన వివరాలివి.. విజయవాడకు చెందిన విజయసాగర్‌కు నరసాపురం పట్టణానికి చెందిన యువతితో వివాహమైంది. ఇటీవల ఇతనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో 498 కేసు నమోదైంది. అతని తండ్రి హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కేసు నమోదు కాగానే ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి తనపై, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసు పెట్టారని, న్యాయం చేయాలని కోరాడు. దీనికి ఎస్ఐ రూ.20 వేలు, రైటర్ నాగేశ్వరరావు తనకు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం ఇస్తేనే కేసులో కొందరి పేర్లను తొలగిస్తామని లేకపోతే యథావిధిగా ఉంచుతామని బెదిరించారు. దీనిపై విజయసాగర్ ఏలూరు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బాధితుడికి రూ.25 వేలు నగదు ఇచ్చి స్టేషన్ సమీపంలో మాటేశారు. లంచం సొమ్మును ఇచ్చేందుకు ఎస్ఐ వద్దకు వెళితే డ్రైవర్‌కు అందించాలని చెప్పాడు. సొమ్మును తీసుకున్న డ్రైవర్ జీపులో పెట్టగానే మాటు వేసిన ఏసీబీ పోలీసులు ఒక్కసారిగా దాడిచేశారు. దీంతో ఉల్కికిపడిన డ్రైవర్ పరుగులు తీశాడు. గుర్తించిన ఎస్ఐ, రైటర్లు బయటకు పరుగులు తీశారు. ఏసీబీ పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. జీపు డ్రైవర్, హోంగార్డు ప్రసాద్ సాయంత్రం ఏసీబీ అధికారుల వద్ద లొంగిపోయారు. వీరిపై కేసులు నమోదు చేసి రాజమండ్రి తరలించారు. ఈ దాడుల్లో సీఐ సతీష్, ఎస్ఐ ఎన్‌పీ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

ఉలిక్కిపడ్డ పోలీసులు..

కొంతకాలంగా నరసాపురం పోలీస్ సర్కిల్‌లోని కొన్ని స్టేషన్లపై తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కొందరు మధ్యవర్తులుగా కేసులు డీల్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నేరుగా లంచాలు తీసుకోకుండా మధ్యవర్తుల ద్వారానే వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఈ ఆరోపణలు టౌన్ పోలీస్ స్టేషన్ పై లేకపోలేదు. ఈ క్రమంలో ఏసీబీ దాడులు పట్టణంలో సంచలనమైంది.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ శ్రీ పూజిత

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- ట్రైనీ కలెక్టర్ శ్రీపూజిత

కైకలూరు, మార్చి 11: క్షేత్రస్థాయిలో అధికారులు ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ శ్రీపూజిత అన్నారు. సోమవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో బూత్, మండల, నియోజకవర్గ స్థాయి ఎన్నికల అధికారులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి కావాల్సిన వసతులను సమకూర్చాలన్నారు. ఎక్కడైనా లోపాలుంటే తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఎన్నికల విధులపై ఎప్పటికప్పుడు అధికారులతో సమావేశాలుంటాయని ప్రతి ఒక్కరు హాజరుకావాలని, ఫోన్లకు అందుబాటులో ఉండాలని, అధికారులు పంపించే సమాచారానికి ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు. ఆర్వో కె. భాస్కర్, తహసీల్దార్ ఎస్. పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



కైకలూరు, మార్చి 11: చిరు ధాన్యాలతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌చార్జి సీడీపీవో లావణ్య అన్నారు. సోమవారం గోపవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ చిరుధాన్యాల్లో ఎన్నో రకాల పోషకాలుంటాయని, వీటి వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, వీటిని క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు వాడాలన్నారు. ఏఎన్ఎం కృష్ణకుమారి, ఆశావర్కర్ రమాదేవి, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య పరీక్షలు

ముదినేపల్లి రూరల్, మార్చి 11: కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాడి రైతులకు ఉచిత గుండె వైద్య పరీక్షలను సోమవారం నిర్వహించారు. విజయవాడ వరుణ్ కార్డియాక్ సైన్సెస్‌లో యాంజియోగ్రామ్ నిర్వహించారు. బొడ్డపాడు, చిన్నపులిపాక, గుండుపాలెం, బొమ్మినంపాడు, అనమనపూడి, కట్లపల్లి గ్రామాలకు చెందిన పాడి రైతులకు ఈ పరీక్షలు నిర్వహించారు. మిల్క్ యూనియన్ కో-ఆపరేటివ్ చైర్మన్ అంజనేయులు, డాక్టర్ వరుణ్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 11: జిల్లాలో ర్యాంప్ స్కీమ్‌గా చేపట్టిన మైక్రో, స్మాల్, మీడియం, ఎంటర్ ప్రెన్యూర్స్ (ఎంఎస్ఎంఈ) సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే పై సంబంధిత అధికారులు, ఎంపీ డీవోలు, కమిషనర్లతో సోమవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో తయారీ, సేవ, వాణిజ్యరంగాలకు సంబంధించి 74వేల సర్వీసులకు సర్వేచేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువచ్చి ఎంఎస్ఎంఈకు అనుసంధానం చేయించాలన్నారు. ఇటీవల చేపట్టిన సర్వేలో ఇంతవరకు 1590 పూర్తి అయిందని, మిగిలిన సర్వే ప్రక్రి య మూడు రోజుల్లో ప్రగతిలోకి తీసుకురావాలన్నారు. జేసీ బి.లావణ్యవేణి మా ట్లాడుతూ అందరికి ఇళ్ల సంబంధించి ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఏలూరు డివిజన్‌లో 3451 అత్యధికంగా పెండింగ్ లో ఉన్నాయని, మిగతా వాటిని త్వరితగతిన ముగించాలన్నారు. డీఆర్వో పుష్పమణి, ఆర్డీవో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న పశు సంపద

భారమైన పెంపకం



ముదినేపల్లి రూరల్, మార్చి 11: నాడు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు పశువులను సైతం పెంచేవారు. ఒక్కో ఇంటికి మూడు నుంచి 30 పశువుల వరకు ఉండేవి. పాలు, పెరుగు, మజ్జిగ గ్రామీణ ప్రాంతాల్లో పుష్కలంగా లభించేవి. రానురాను పశుపోషణ భారంగా మారడంతో రైతులు హడలిపోతున్నారు. పశువుల దాణా వరి గడ్డి ధరలు ఎప్పటికప్పుడు పెరిగిపోవడంతో పాడి రైతులు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ రైతులకు ఎంతో లాభసాటిగా ఉండేది. ప్రస్తుతం వ్యవసాయం, పాడి పరిశ్రమ రైతులను నష్టాలకు గురి చేయడంతో పశువులు అంతరించి పోతున్నాయి. గ్రామాల్లోని పశువులు కబేళాలకు తరలిపోవడంతో భవిష్యత్తులో పశువుల కొరత తీవ్రంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సైతం పాల ప్యాకెట్లను కొనుగోలు చేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అవగతమవుతుంది. పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. జాతి పశువు ఒక్కోటి లక్ష నుంచి రెండు లక్షల వరకు పలుకుతోంది. నాటు రకం పశువులు సైతం ఒక్కోటి రూ.60వేల నుంచి రూ.90వేల వరకు పలకటం గమనార్హం. భవిష్యత్తులోనూ ఇదే పరిస్థితి కొనసాగితే పశువులు పూర్తిగా అంతరించిపోయినా ఆశ్చర్యపడనక్కర్లేదని పాడి రైతులు చెబుతున్నారు.





తిష్టవేసిన కుక్కలు.. (ఇన్‌సెట్) చనుబండలో కుక్కల మంద చంపేసిన మేక పిల్లల వద్ద బాధితురాలి రోదన

చంపేశాయ్..

- కుక్కల దాడిలో 11 మేక పిల్లల మృతి
- చనుబండలో ఘటన
- ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

చాట్రాయి, మార్చి 11: మండలంలోని చనుబండలో మోదుగు జోజి మేకల దొడ్డిపై సోమవారం కుక్కల మంద దాడి చేసి 11 మేక పిల్లలను చంపేశాయి. చనిపోయిన మేక పిల్లలను చూసి యాజమాని కుటుంబీకులు భోరున విలపించారు. గ్రామాల్లో కుక్కల సంఖ్య పెరిగి మందలుగా సంచరిస్తూ గొర్రెలు, మేకల దొడ్లపైనా, మనుషులపైనా దాడులకు తెగబడుతున్నాయని, అధికారులు స్పందించి కుక్కలను పట్టించి దూర ప్రాంతాల్లో అడవులకు తరలించాలని బాధితులు కోరుతున్నారు.

హడలెత్తిస్తున్న వీధికుక్కలు

మండలంలో అన్ని గ్రామాల్లో వీధికుక్కలు విపరీతంగా పెరిగి మనుషులు మూగజీవాలపై దాడులకు తెగబడుతుండటంతో ప్రజలు హడలిపోతున్నారు. ఎక్కడ చూసినా మందలు మందలుగా కుక్కలు సంచరిస్తున్నాయి. రాత్రిపూట వీధుల్లో తిష్టవేసి దారినపోయే బైక్‌లు, మనుషులు వెంటపడి గాయపరుస్తున్నాయి. పిల్లలు, మహిళలు ఇళ్ళ నుంచి బయటకురావాలంటే భయపడుతున్నారు. గొర్రెలు, మేకల దొడ్లపై దాడిచేసి జీవాలను చంపివేస్తున్నాయి. గతంలో పంచాయతీలు సంవత్సరానికి ఒకసారి కుక్కలను నిర్మూలించేవారు. శునక సంరక్షణ సంఘాలు కుక్కలను చంపితే అధికారులపై కోర్టుల్లో కేసులు వేస్తుండటంతో కుక్కల నిర్మూలన జరగటం లేదు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద టీడీపీ శ్రేణుల ధర్నా



కైకలూరు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాల పంపిణీ

'రైతుల గోడు పట్టించుకోని జగన్'

నూజివీడు, మార్చి 11: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటతో రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారం చేస్తోందే తప్ప సీఎం జగన్ రెడ్డి రైతులకు చేస్తున్న మేలు ఏమీలేదని నూజివీడు టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో రైతుల సమస్యలపై నిరసన తెలుపుతూ టీడీపీ ఆధ్వర్యంలో నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర, అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ ధాన్యం సేకరించి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ వారికి సొమ్ము జమ చేయలేదన్నారు. నూజివీడు మామిడి చీడపీడలతో పంట దిగుబడి దెబ్బతిని రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని స్థానిక ఎమ్మెల్యే వారికి న్యాయం చేయాలన్నారు. నూజివీడు నియోజక వర్గంలో ఎస్సీలకు జరుగుతున్న అన్యాయంపై తాను ప్రశ్నించగానే ఉలిక్కిపడిన వైసీపీ పెద్దలు ఏఎంసీ చైర్మన్ పదవిని భర్తీ చేయించటం స్వాగతిస్తున్నామన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీను, నూజివీడు, చాట్రాయి మండల తెలుగురైతు అధ్యక్షులు అక్కినేని బెనర్జీ, చల్లగుళ్ళ రాజారత్నం, కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షులు చిట్నేని శివరామకృష్ణ, నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, నూజివీడు మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు ముసునూరు రాజా, మల్లిశెట్టి జగదీష్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

టీడీపీతోనే రాష్ట్రానికి పూర్వవైభవం..

కైకలూరు: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందని టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు అన్నారు. సోమవారం కైకలూరులోని 125వ బూత్‌లో సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్‌ను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ జగన్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందని, ఉద్యోగాలు లేక యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని జగన్ అసమర్థతతోనే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తే వైసీపీ ప్రభుత్వంలో సమస్యలు పెరిగిపోయాయని, మళ్లీ రాష్ట్రానికి మంచిరోజులు రావాలన్నా ప్రజల భవిష్యత్తు బాగుండాలన్నా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, నారగాని వీర వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ బాషీద్, గఫూర్, బాజానీ, ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా, పార్టీ సీనియర్ నాయకులు వేములపల్లి కారుణ్య, లక్కింశెట్టి మోహన్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు పడమటి వాసు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కామినేని

రాజధాని లేని రాష్ట్రం మనదే : కామినేని

ముదినేపల్లి రూరల్, మార్చి 11: రాజధాని లేని రాష్ట్రం మనదేనని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, కరెంటు బిల్లుల భారం పెరిగిందన్నారు. నియోజకవర్గంలో తీవ్ర స్థాయిలో అరాచకాలు పెరిగిపోతున్నాయని, అత్యధికంగా గిరిజనులు ఉన్న గురజ గ్రామం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ప్రజలంతా అరాచక పాలన అంతమొందించాలని, తాను అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.



జనసేనలో చేరిన యువకులతో బర్మా ఫణిబాబు

జనసేనలో యువకుల చేరిక

నూజివీడు టౌన్, మార్చి 11: జనసేనను బలోపేతం చేసేందుకు యువత కృషి చేయాలని, నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు అన్నారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామానికి చెందిన 20 కుటుంబాల యువకులు ఆ గ్రామానికి చెందిన అశోక్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ సమన్వయకర్త బర్మా ఫణిబాబు పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషిచేసి జనసేన - టీడీపీ కూటమిని అధికారంలోకి తేవాలని కోరారు. జనసేన నాయకులు పాశం నాగబాబు, తోట వెంకట్రావు, ఏనుగుల చక్రి, రామిశెట్టి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల సమాచారం వెల్లడించాలి

ముసునూరు: ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు జి.రాజు డిమాండ్ చేశారు. సోమవారం ముసునూరు స్టేట్ బ్యాంకు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం రూ.16,500కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చాయని, వాటి వివరాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 5, 6 తేదీల్లోగా బహిర్గతం చేయాల్సి ఉండగా, నేటికీ తెలపలేదన్నారు. సీపీఎం నాయకులు కె.శ్రీనివాసరావు, రెడ్డి తిరుపతిరావు, నక్కా నాగరాజు, కె.రంగారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: ఎన్నికల బాండ్లు సమాచారం బహిర్గతం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నూజివీడు ఎస్‌బీఐ వద్ద సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల బాండ్ల విషయాన్ని బహిర్గతం చేయకుండా బీజేపీ బ్యాంకులపై వత్తిడి తీసుకువస్తూ రాజకీయ ప్రయోజనాన్ని పొందాలని చూస్తోందన్నారు. సీపీఎం నాయకులు దుర్గారావు, శ్యాంసన్, శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు ఎస్‌బీఐ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఏడాది కష్టం..
ఏదీ లాభం?

- గిట్టుబాటి కాని చేపల పెంపకం
- పెరిగిన పెట్టుబడులు
- తగ్గుతున్న ధరలు
- సబ్ లీజులకు చెరువులు

చేపల రైతు నష్టాలపాలవుతున్నాడు. ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని అధిక పెట్టుబడులతో పెంచిన చేపలకు మార్కెటింగ్ కరువై రైతులు అల్లాడిపోతున్నారు. స్థానిక మార్కెట్ మందగించటంతోపాటు ఇతర రాష్ట్రాలకు చేపల ఎగుమతులు భారీగా తగ్గిపోవటంతో పెంచిన చేపల పట్టుబడులు చేపట్టాలా వద్దా? అన్న సందిగ్దంలో చేపల చెరువుల రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

ముదినేపల్లి, మార్చి 11 : సుమారు ఏడాది కాలంపాటు పెంచిన చేపలను అమ్ముకునే దారి లేక, గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్ర మనోవేదనకు గురి కావటమే కాక, చెరువులకు లీజులు ఎలా చెల్లించాలన్నది అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో సుమారు 60 వేల ఎకరాల్లో చేపల పెంపకం జరుగుతున్నది. రొయ్యల పెంపకంలో వస్తున్న నష్టాలతో చాలా మంది రైతులు చేపల పెంపకంపై మొగ్గు చూపారు. తెల్ల చేపలకు ధరలు నిలకడగా లేకపోవటంతో రైతులు వూహించని విధంగా నష్టాలు ఎదుర్కొంటున్నారు. చేపలను పెంచే సమయంలో ఉన్న ధరలు పట్టే సమయానికి తగ్గిపోతున్నాయి. దీంతో అత్యధిక శాతం మంది రైతులు చెరువుల లీజుల సొమ్ము కూడా చెల్లించలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.





చేపల చెర్వు.. (ఇన్‌సెట్) పట్టుబడులు చేసిన చేపలు (ఫైల్)

కనీసం పెట్టుబడులు రాక..

చేపల చెరువుల రైతులకు కనీసం పెట్టుబడి కూడా గిట్టుబాటు కావటం లేదు. టన్ను తెల్ల చేప పెంపకానికి పది నుంచి 12 నెలల కాలానికి సుమారు లక్షా పది వేల నుంచి లక్షా 30 వేల ఖర్చు అవుతున్నది. లీజులు, చేపల మేతలు, కూలీలు తదితర ఖర్చులు పెరిగిపోవటం, మార్కెటింగ్ ఆశాజనకంగా లేకపోవటంతో పెట్టుబడి భారీగా పెరిగింది. ప్రస్తుత మార్కెట్ ప్రకారం తెల్ల చేపల ధర టన్ను ఒక్కింటికి సుమారు లక్ష నుంచి రూ.1.05 లక్షలు మాత్రమే ఉంది. అంటే టన్ను చేపలకు సుమారు రూ.20 నుంచి 25 వేల నష్టం వస్తున్నది. దీంతో చేపల రైతులకు పెట్టుబడి కూడా చేతికి రావటం లేదు. కొన్ని చోట్ల చేపల వర్తకులు సిండికేట్ అయ్యి ధరలను తగ్గించేస్తున్నారని, చేపల పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లి ప్రాంతంలో చాలా మంది రైతులు తాము లీజుకు తీసుకున్న చెరువులను సబ్ లీజులకు ఇచ్చేందుకు కూడా సిద్ధమవుతున్నారు.



చేపల సాగు చేయలేం

పెరిగిన లీజులు, మేతల ధరల వల్ల తెల్ల చేపల సాగు చేయలేం. సరైన మార్కెటింగ్ లేదు. ధరలు గత ఏడాది టన్ను ఒక్కింటికి లక్షా 25 వేలు ఉండగా, ఈ ఏడాది లక్షకు పడిపోయింది. అంత నష్టాన్ని భరించలేక చేపల సాగు పట్ల రైతులు బెంబేలెత్తుతున్నారు.

-శ్రవణం శివప్రసాద్, చేపల రైతు, పెదగొన్నూరు.

పంచాయతీ చెరువులో ఆక్రమణ తొలగించండి



ఎంపీడీవోకు అర్జీ ఇస్తున్న టీడీపీ నాయకుడు

ముసునూరు, మార్చి 11: మండలంలోని రమణక్కపేట గ్రామంలో గల పంచాయతీకి సంబంధించిన కోమటికుంట చెరువులో ఆక్రమణను తొలగించాలని కోరుతూ టీడీపీ నాయకుడు రంగు శ్రీనివాసరావుతో పాటు మరికొంతమంది స్థానికులు సోమవారం ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవికి స్పందనలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్.యస్.నంబర్ 258/1లో 13.52 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కోమటికుంట చెరువులో స్థానిక వ్యక్తి ఒకరు 20 సెంట్లు భూమిని ఆక్రమించి మెరకచేసి అందులో రేకులషెడ్డు నిర్మిస్తున్నాడని తెలిపారు. గతంలోనే ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్ళినా నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. సదరు ఆక్రమణవల్ల పంచాయతీకి సంబంధించిన చెరువు విస్తీర్ణం తగ్గిపోయే ప్రమాదం ఉందని, చెరువుల ఆక్రమణను తొలగించి, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని శ్రీనివాసరావుతో పాటు స్థానికులు ఎంపీడీవో పద్మావతిని కోరారు.

స్పందనకు 10 అర్జీలు : ఆర్డీవో

నూజివీడు టౌన్, మార్చి 11: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనకు నూజివీడు డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యలపై పది అర్జీలు దాఖలైనట్లు నూజివీడు ఆర్డీవో భవానీశంకరి తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నూజివీడు టౌన్, మార్చి 11: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ద్వితీయ సంవత్సర ఇంటర్, గణితం, జంతుశాస్త్ర పరీక్షలను నూజివీడులోని ఐదు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 1231 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 30 మంది గైర్హాజరయ్యారు.

మొక్కుబడిగా మండల సమావేశం



నూజివీడు టౌన్, మార్చి 11: నూజివీడు మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సోమవారం ఉదయం నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, ఉపాధి హామీ పథకం అధికారులు తమశాఖల ద్వారా అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల వినియోగాన్ని వివరించారు. జలజీవన్ అభియాన్ ద్వారా ప్రతి గ్రామంలోనూ తాగునీటి పైప్‌లైన్‌లను వేస్తున్న విధానాన్ని అధికారులు సమావేశానికి హాజరైన సభ్యులకు వివరించగా, వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బలివేలో హుండీల లెక్కింపు



ముసునూరు, మార్చి 11: బలివే రామలింగేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఉత్సవాల ప్రత్యేక అధికారి వి.హరిప్రసాద్, ఆలయ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కించగా రూ.14 లక్షల 47 వేల 371లు ఆదాయం వచ్చినట్లు ఉత్సవాల ప్రత్యేక అధికారి హరిప్రసాద్ తెలిపారు. గత ఏడాది ఉత్సవాల హుండీ ఆదాయం రూ.11,35,514లు రాగా ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా హుండీ ఆదాయం రూ.3,11,857లు పెరిగిందని తెలిపారు.

భోగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



కలిదిండి, మార్చి 11 : శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతాళ భోగేశ్వరస్వామి హుండీ ఆదాయం సోమవారం లెక్కించగా రూ.25 లక్షల 89 వేల 979 ఆదాయం లభించినట్లు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ చైర్మన్ అడవి వెంకట గంగాధర శర్మ, ధర్మకర్తలు సీహెచ్. బలరామరాజు, కె.సుబ్బలక్ష్మి, సొసైటీ చైర్మన్ వడుపు రామారావు, చిట్టూరి శ్రీనివాసరావు, అర్చకుడు ఉమా శంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొర్లకుంటలో సురక్ష వైద్య శిబిరం

ముసునూరు, మార్చి 11: మండలంలోని కొర్లకుంట సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. గ్రామస్థులు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉసిరి మొక్క పరిరక్షణకు విరాళం

ముసునూరు, మార్చి 11: మండలంలోని చింతలవల్లి గ్రామ పంచాయతీ శివారు గోగులంపాడులోని కోదండరామాలయం వద్ద ఉన్న ఉసిరి చెట్టు పరిరక్షణ కోసం చిర్రా బాలకృష్ణ రూ.10 వేలు నగదును ఆలయ కమిటీకి సోమవారం అందజేశారు. గత ఏడాది బాలకృష్ణ తన జన్మదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉసిరిచెట్టును నాటాడు. అయితే సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా ఉసిరిచెట్టు పరిరక్షణ కొరకు రూ.10 వేలు అందజేయటంపై కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముద్దరబోయిన ఆత్మీయ సమావేశం

ఆగిరిపల్లి, మార్చి 11: తాము ముద్దరబోయిన వెంటే ఉంటామని యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ముద్దరబోయిన అభిమానులు అన్నారు. ఆగిరిపల్లిలో ముద్దరబోయిన ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ తాను ఇండిపెండెంట్‌గా పోటీచేసి బీసీలకు న్యాయం చేస్తానని, నూజివీడు నుంచి ఆగిరిపల్లికి అధ్వాన రోడ్లలో ప్రయాణం గంట సమయం పడుతుందని ఇలాంటి గతుకుల రోడ్లలో నరకం చూస్తున్నామని ప్రభుత్వాన్ని విమర్శించారు.

మహిళా సంక్షేమమే లక్ష్యం

కలిదిండి, మార్చి 11 : మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత చెక్కును ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణతో కలసి ఆయన అందించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, కలిదిండి సర్పంచ్ మారుతి ప్రసన్న, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం



కలిదిండి, మార్చి 11 : పాడి పశువులకు సకాలంలో కృత్రిమ గర్భధారణ చేస్తే మేలు జాతి దూడలు జన్మిస్తాయని పశు సంవర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ గెడ్డం నెహ్రూ అన్నారు. సోమవారం సానారుద్రవరంలో పశుసంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువుల్లో గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం, లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. డివిజన్ ఉప సంచాలకుడు గోవింద రాజులు మాట్లాడుతూ చూడి, పాడి పశువులకు సరైన పోషకాహారం అందించాలన్నారు. లేగ దూడలకు ఏలిక పాముల మందు, వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి పెయ్యి దూడలను పొందితే పాడి ఉత్పత్తి పెంచుకొని ఆర్థికంగా రైతులు అభివృద్ధి చెందాలన్నారు. లింగ నిర్ధారిత వీర్య నాళిక సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. లేగ దూడల ప్రదర్శనలో మొత్తం 31 దూడలు పోటీల్లో పాల్గొన్నాయి. ఆవుదూడల పోటీల్లో నున్న భగవాన్‌కి ఆవు దూడకు ప్రథమ స్థానం, గేదె దూడల పోటీల్లో మారుబోయిన నాగరాజు గేదె దూడకు ప్రథమ స్థానం దక్కించుకున్నాయని పశు వైద్యాధికారి ఫణి తెలిపారు. సర్పంచ్ రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ మహాలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.